శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

గురోర్ మూర్తిం స్మరే నిత్యం... గురోర్ నామం సదా జపేత్...
గురోర్ వాక్యం ప్రకుర్వీత... గురోర్ అనన్య భావయేత్



# కృప

గురుచరణం మనసా స్మరామి గురుచరణం
గురుచరణం వచసా దృణామి గురుచరణం
గురుచరణం శిరసా నమామి గురుచరణం
గురుచరణం శరణం ప్రపత్యే గురుచరణం

గురుపూర్ణిమ సంచిక

కృపాహి కేవలం



కృపాహి కేవలం

## Faithకి, ప్రేమకి చాలా తేడా ఉంది

రేప్పొద్దున్న నీ బిడ్డలు పెద్దవాళ్లయిపోయి, నిన్ను జాగ్రత్తగా చూసుకుంటారనే నమ్మకంతో వాళ్ళని సాకుతున్నావా నీవేమన్నా? ప్రేమతో సాకుతున్నావు. అది నమ్మకానికి, ప్రేమకు ఉండే తేడా. బాబా నన్ను రక్షిస్తారో, రక్షించరో అయినా సరే నేను ఆయన్ని ప్రేమిస్తున్నాను. అందుకనే నేను చెప్పింది బాబా నన్ను స్వర్గానికి తీసుకుపోతాడని నేను బాబాని ప్రేమించడంలా! బాబా అంటే నాకు ప్రేమ ఉంది. ఆయన దగ్గర ఉండటమే నాకు స్వర్గం. ఆయన నరకానికి వెళితే, నేను అక్కడికే వెళతా. I prefer hell not heaven. ముక్తికాదు ఆయన బంధానికి తీసుకుపోతాడంటే, Yes, I prepare for that. అదీ ప్రేమ అంటే. నన్ను నీవు అక్కడకు తీసుకుపోతే, నాకు అది చేస్తే, నాకు ఇది ఇస్తే నిన్ను నేను ప్రేమిస్తాను అంటే, దాన్ని ప్రేమ అంటారా?

ఆయన ఎక్కడుంటే, అదే స్వర్గం. ఆయనెక్కడికి తీసుకుపోతే అదే స్వర్గం. అదీ ప్రేమంటే. బాబా నన్ను ముక్తివైపు నడిపిస్తాడు. సన్మార్గంలో నడిపిస్తాడు. నాకు రక్షణ ఇస్తాడు. నాకు మంచి జాబ్ ఇస్తాడు. బ్యాంక్ బ్యాలెన్స్ ఇస్తాడు. అందుకని నాకు బాబా అంటే ప్రేమ. అంటే అది ప్రేమ కాదు. వ్యాపారం. ముందు అట్లాగే పుట్టొచ్చుగాక ప్రేమ. కాబట్టి ప్రేమకు, నమ్మకానికి చాలా తేడా ఉంది. నేను బాబాను నమ్మమని ఎప్పుడూ ఎవరికీ చెప్పను. బాబాను ప్రేమించండి. ప్రేమించడానికి Experience based కాదు. ఎందుకని, ప్రేమే ఒక Experience అది తెలియాలి. ఎందుకో తెలియనటువంటి ఒక శాంతి, ఒక ఇష్టం, ఒక sense of security కలుగుతుంది. ఎందుకు అని అడిగితే సమాధానం చెప్పలేం. అదే నేను last satsang లో చెప్పింది. అట్లా అయ్యేటువంటిదే ప్రేమ.

–శ్రీబాబూజీ




సంపుటి : 19
జూలై 19

# కృప

సంచిక : 3
2016




## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏకకంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్యప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



లోపలి పేజీలలో


పథగామి 4
– గురుకృప

శ్రీబాబూజీ 9
– గురుకృప

సద్గురు అనుగ్రహ 'గురు'తులు 5
– శేఖర్

నీ కొరకు నేను నావనౌతాను 18
– పార్థసారధి ప్రవచనాలు

గురుపథం - ప్రగతిపథం 8
– గురుకృప

గురుకృపాలహరి 27
– గురుకృప



నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు
GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.
Web : www.gurukrupa.info




# పథగామి

సద్గురుపథగాములకు గురుపూర్ణిమే కొత్త సంవత్సర ప్రారంభం. నిజానికి ఈ అనంత విశ్వంలో పాత సంవత్సరం, కొత్త సంవత్సరం అంటూ ఏమీ లేవు. ఎప్పుడూ నిత్య నూతనత్వమే జీవితం అంటారు శ్రీబాబూజీ. ఈ ఎల్లలన్నీ మనం మన జీవితం ఎలా సాగుతుందో చూసుకోవడానికే, ఇది పోయి ఇతరులతో పోల్చుకోవడంగా పరిణామం చెందింది. మూలం మరుగున పడింది. మనం ఏర్పరచుకున్న ఈ సంవత్సరాలు మనం ముందుకు పోతున్నామో, ఉన్నచోటునే ఉన్నామో, వెనక్కి పోతున్నామో తెలుసుకోవడానికి ఏర్పరచుకున్నది. అందుచేత క్రితం సంవత్సరంతో పోల్చుకుంటే ఒక 'మనిషి'గా మనం పురోగమించామా లేదా గమనించుకోవాలి. వ్యాపారం అభివృద్ధి చెంది ఉండవచ్చు, ఉద్యోగంలో ప్రమోషన్, జీతంలో ఇంక్రిమెంట్స్, జీతంలో పెరుగుదల, మనం బాగా సంపాదించి ఉండవచ్చు. అమ్మాయో, అబ్బాయో పుట్టడం, అమ్మాయి, అబ్బాయి పెళ్ళి చేసి ఉండవచ్చు. అబ్బాయికి ఉద్యోగం వచ్చి ఉండవచ్చు. అమ్మాయికి ర్యాంక్ వచ్చి ఉండవచ్చు. కాని ఇవి కాదు అసలు విషయం. ఒక మనిషిగా క్రితం సంవత్సరం కన్నా కొద్దిగానైనా మెరుగయ్యామా? లేదా? అన్నది చూసుకోవాలి. అలాగే వచ్చే సంవత్సరం కల్లా ఇప్పటికన్నా చాలా మెరుగైన మనిషిగా మారాలి. ఇంకా సంతోషంగా, ప్రశాంతంగా, తృప్తిగా, ప్రేమగా అన్నిరకాలుగా ఉత్తమమైన మనిషిగా ఉండేలా తయారవ్వాలి. దానికి గురుపథంలో మనమేం చేయాలో నిర్ణయించుకునే తొలిరోజు గురుపూర్ణిమ. మనలోని స్ఫూర్తిదాయక ఆలోచనలు ఆచరణగా మారితే మనలో మానవత్వం పొంగిపొర్లుతుంది. అప్పుడు దివ్యత్వం దానంతటదే సంభవిస్తుంది. ***మనిషి దైవంగా పెరగడం బాబా మతం.*** అప్పుడు మనం బాబాకు ఇష్టమైన, ప్రీతికరమైన నైవేద్యంగా సమర్పణ కాగలం అంటారు శ్రీబాబూజీ.

వచ్చే గురుపూర్ణిమ వరకు మనలో ఈ స్ఫురణ నిలిచే ఉండాలి. మన విద్యుక్త ధర్మాన్ని మనం చక్కగా, నిండుగా నిర్వహిస్తూనే ఉండాలి. మన తండ్రి, తల్లి, దైవము అయిన గురుదేవులు సంతోషించే విధంగా మన జీవన విధానం కొనసాగాలి. **(మీరెంత ఆనందంగా ఉంటే నేనంత ఆనందంగా ఉంటాను. –శ్రీబాబూజీ)** జరుగుతున్న గురుపూర్ణిమ వేడుక, ఉత్సవం మన జీవితంలో ఒక సువర్ణ అధ్యాయానికి శ్రీకారం చుట్టాలి.

***– గురుకృప***

## సద్గురు అనుగ్రహ 'గురు'తులు....




**ఆనందమూర్తికై నిరీక్షణం... అపురూపమే ప్రతిక్షణం..**

ఎవరికోసమైనా పది నిమిషాలు వెయిట్ చేయాలంటే ఎంతో అసహనానికి గురయ్యే నేను ఎందుకు అక్కడ అన్నేసి గంటలు వెయిట్ చేయగలను. మిగతా సందర్భాలలో చికాకు తెప్పించే నిరీక్షణ అప్పుడెందుకు ఆనందాన్ని ఇస్తుంది క్షణక్షణాన.. మరొకరి కోసం ఎదురు చూసేటపుడు బుస్సున ఎగసి పడే నా అహం... ఆ మూర్తి కోసం వేచి ఉన్నప్పుడు మాత్రం అంటుంది 'ఆహా ఏమి నా భాగ్యం'.. 'అహం' ఆనందపడే ఆ సమయం...

బహుశా ప్రపంచంలోని మిగతా జనం అంతా తమకే తెలియకుండా దేనికోసమైతే ప్రాకులాడతారో అది ఇంకొంచెం సేపట్లో తనకు కనిపిస్తోందన్న ఆనందమేమో..

మనిషి స్వభావంలో స్వతహాగా ఉండే సాత్విక భావాలు... అనుభూతులు.. అర్థవంతమైన ఆలోచనలు... నిజాయితీ అన్నీ కట్టగట్టుకొని ఆ క్షణాన నాలో ఎలా ప్రకటం అయ్యాయో తెలియదు కాని, అందుకు కారణం మాత్రం నేను ఎదురు చూస్తున్న 'సత్యమే' అని అర్థమయ్యింది. అంటే సమీపిస్తోన్న కొద్దీ తన (ఎన్విరాన్‌మెంట్) కక్ష్యలోకి వచ్చిన వారినందరినీ పాజిటివ్‌గా మార్చే ఆ మూర్తి ఏమయి ఉండాలి... ఆ స్థితి ఎంతటిదై ఉండాలి....

***విశ్వమంత ప్రేమను... ఇసుమంత వీక్షణము... రవంత నవ్వులో... అందించే ఆ కరుణామూర్తి కొరకు జీవిత కాలము వేచి ఉన్నా ధన్యమే... ఆ జీవితమంతా భగవత్ 'ధ్యానమే'...***

***శరత్ చంద్రుని చల్లని చూపు .... 'మేలు' కొల్పు***

"నా వంక ప్రేమగా చూసారు"..."నన్ను చూపుతోనే పలకరించారు"..."నన్ను చూస్తూ ఏదో చెప్పారు"

"నేను చేసిన తప్పు ఆయనకు తెలిసిపోయింది... ఆయన చూపులోనే నాకు అర్థమయింది".

"అబ్బా...గురువుగారు ఇవాళ నన్ను ఎంత లాలనగా చూసారంటే... ఇప్పటికీ కళ్ళు మూసుకుంటే ఆ చూపే కనిపిస్తోంది...నా ఒళ్ళు పులకరిస్తోంది."

"గురువుగారు నన్ను చూస్తుంటే... నా హృదయంలో దాగి ఉన్న... ఆలోచనలన్నింటిని తరచి తరచి చూస్తున్నట్లు అనుభూతి కలిగింది."




"ఉద్యోగం వచ్చింది అని చెప్పాను... ఎంత ప్రసన్నంగా చూసారో!"

"నా కష్టం చెప్పుకున్నప్పుడు ఎంత కరుణతో...ఎంత సానుభూతితో చూసారో చెప్పలేను... ఆ చూపు చాలు నా కష్టం తీరిపోతుంది అనిపించింది".

ప్రేమగా చూడటం... పలకరిస్తూ చూడటం... పలుకుతూ చూడటం...కరుణిస్తూ చూడటం...అనుగ్రహం వర్షిస్తూ చూడటం...ఆయనకే సొంతం...సాధ్యం...

ఆయన చూపులో లాలన...పాలన...అనుగ్రహం...ఆగ్రహం... అనుభవైకవేద్యమే కాని వర్ణన అసాధ్యం, అవివేకం.

"శరత్ చంద్రుని చల్లని చూపు...వెతలు బాపు...'మేలు' కొల్పు...దారి చూపు...తండ్రీ నీవే మా వేల్పు."

***పిలుపు ఏదైనా పలకరింత ఒక్కటే...పలుకు ఏదైనా ప్రేమ ఒక్కటే...***

ఆయనను ఒక్కొక్కరూ ఒక్కోలాగ పిలుస్తారు. ఆయనా అలాగే స్పందిస్తారు.

'స్వామి' అంటారు కొందరు...'బాబా' అంటారు కొందరు...'గురూజీ' అంటారు చాలామంది. 'గురువుగారు' అంటారు ఇంకొంతమంది...ఎవరు ఎలా పిలిచినా...ఆయనకు పట్టింపు లేదు. ఆయన కురిపించే ప్రేమలో మార్పులేదు.

ఆయనతో ఎన్నో సంవత్సరాలుగా అనుబంధం ఉన్నవారు ఆయనను 'సార్' అని సంబోధిస్తారు... ఆ 'సార్' అన్న పిలుపులో ఎన్నో భావాలు ఉన్నాయి. ఎన్నో బంధాలు ఉన్నాయి...

***ఎందుకూ కొరగాని, ఏమీ చేతగాని, ఏ అర్హతా లేని నన్ను ఆదరించి, అక్కున చేర్చుకొని నాకు ఒక ఐడెంటిటీ నిచ్చి, అర్హతనిచ్చి , విద్యాబుద్ధులు చెప్పించి, ఉపాధి కల్పించి, జీవితాన్ని నిలబెట్టిన 'సార్'...***

***కరుడుగట్టిన ఆచార విచారాల పాలబడి 'విద్య' పేరున నేర్చిన మిధ్యలో జీవితపు ఆటుపోట్లకు ఎదురీదుతున్న నాకు అసలైన విజ్ఞానాన్ని, జీవితపు సత్యాలను ఎరుకపరిచి, సాయితత్వ ఓనమాలు దిద్దించి, ఉద్ధరించిన 'సార్'........***




వ్యాపారం, సంసారం ఇదే జీవితమని, ఇదే ఆనందమని ప్రతి దానికీ ఒక లెక్క ఉంటుందని అనుకునే నాకు తమ అవ్యాజ ప్రేమ ద్వారా కొత్త దృక్పథాన్ని, కొత్త జీవితాన్ని అంతులేని ఆనందాన్ని, 'లెక్క'కు మిక్కిలిగా సంతృప్తిని అందించి అక్కున చేర్చుకున్న మా 'సార్'.....

ఇలా 'సార్' అన్న పిలుపు నేపథ్యంలో ఎన్నో అర్థాలున్నాయి... ఎన్నో జీవితాలున్నాయి...

ఇక తమ బాల్యాన్ని ఆయన సన్నిధిలో గడిపి భాగ్యం పొందినవారు ఆయనను 'అంకుల్' అని పిలుస్తారు...

ఆ రోజుల్లో ప్రతిరోజూ మిమ్మల్ని చూస్తూ, మీతో మాట్లాడుతూ గడిపినపుడు మీ గొప్పతనం తెలియలేదు 'అంకుల్'...

వ్యక్తిత్వం రూపుదిద్దుకునే వయస్సులో అలతి అలతి పదాలతో, చిన్న చిన్న సూచనలతో మీరు నేర్పిన విషయాలు ఎన్నటికీ మరువలేము 'అంకుల్'...

*ఎన్ని సంబోధనలో... అన్ని బోధనలు...*

*ఎన్ని బంధాలో... అన్ని అనుభూతులు...*

*ఎన్ని జీవితాలో... అన్ని అనుభవాలు...*

*ఎన్ని అవసరాలో... అన్ని అవకాశాలు...*

*ఎన్ని కోరికలో... అన్ని వరాలు...*

*నేర్చుకునేందుకు ఎంత సంసిద్ధతో... అంత ప్రసన్నత...*

*ఎంత గురో... గుండెల్లో ఎంత 'గురు'తో అంత అనుగ్రహం...*

*తండ్రీ! నీ ప్రేమకు బద్ధులం... నీవు చూపిన మార్గానికి సదా నిబద్ధులం. – శేఖర్*

**గురుదర్శన ఫలం మనకందాలంటే వారు ప్రసాదించిన ఉపకరణాలైన సత్సంగం, పారాయణ, నామస్మరణ, సద్గ్రంథ పఠనం అన్నింటినీ వారు చెప్పిన రీతిన ఉపయోగించుకున్నపుడు మనకు తెలియకుండానే మనలో పరిణతి కలుగుతుంది. అపరిమితమైన ఆనందం సొంతమవుతుంది. అనంతమైన గురుకృప అర్థమవుతుంది. – *శ్రీబాబూజీ***




# గురుపథం - ప్రగతిపథం

మనం మన అస్థిత్వపు లోతుల్లోకి (మనం బాబా సంబంధీకులం) చూడకుండా, కేవలం అస్తిత్వపు బాహ్య పరిస్థితుల ప్రభావాలకు లోనై ఆందోళనలకు లోనవుతుంటాము. అలా జీవించే వారితోనే సాంగత్యం చేస్తూ ప్రతి చిన్న విషయానికి ఆందోళన పడుతుంటాం. ఇట్టి సాంగత్యాలు వదులుకోవాలి.

మనం ఏదైనా పని తొందరలో ఉన్నా సరే – ఒక్క క్షణం ఒకే ఒక్క క్షణం ఆగి (మనలోకి మనం ఒక్క అడుగు వేయడం) ఆలోచించు – మనం చేయాలనుకుంటున్న పని మన ఇష్టదైవానికి (గురువుకు) దగ్గర చేస్తుందా? లేదా అని, మనకు సమాధానం లభిస్తుంది. ఆ తరువాత ఆ పని ఎంత చక్కగా, సులభంగా, మామూలుకన్న త్వరితంగా చేయగలుగుతాం. మనకే ఆశ్చర్యం కలుగుతుంది.

మనల్ని ఎవరైనా నిందించినా, ఆగ్రహించినా, అందుకు వెంటనే ప్రతిస్పందించక – ఒక్కక్షణం మనలోకి మనం ఒక్క అడుగు వెనక్కు వేస్తే మనపై ఆగ్రహించినవారికి మన నుంచి ప్రతిస్పందన లభించక వారి ఆగ్రహం నెమ్మదించి, చల్లగా చల్లారిపోతుంది. ఇలా ఒక్కక్షణం ఆలోచనతో ఒక్క అడుగు లోపలికి వేయడం – ఒక్క అడుగు వెనక్కి వేయడం ఇవన్నీ ఆ సన్నివేశాలతో, సంఘటనలతో మనల్ని మన ఇష్టదైవానికి అనుగుణంగా మసలుకునే స్థితి – మనలోని హృదయాంతర్వర్తి అయిన సద్గురుని ఉనికిని ప్రసాదిస్తుంది (ఎరుకలోకి వస్తుంది). అలా పరిసరాలను మార్చుకోగలం. ఇలా మన జీవితంలోని సంఘటనలతో, సన్నివేశాలతో వారి సాన్నిధ్యాన్ని, సాన్నిహిత్యాన్ని అందిస్తూ, మన హితాన్ని కోరి సారధ్యాన్ని వహిస్తున్న గురుదేవులు, వారు అందించిన సాయిపథంలో మనం జీవన సమృద్ధిని పొందగలం. ఇలా నిలిపి, నడిపే పథం గురుపథం, ప్రగతిపథం, మహితపథం, ఆనందపథం, అనుగ్రహ శుభ్రమార్గం, సద్గురుపథం. ప్రశాంతంగా, నిశ్చింతగా, నిర్మలంగా జీవించడం అనేది మనలోని దివ్యత్వపు ఉనికిని తెలిపే తొట్ట తొలి సంకేతం, నీవు నా వాడివి అన్న సంతకం.

– ***గురుకృప***

**బాబాకు ఇష్టమైనవి ఏమిటో మీకు తెలుసు. ఆయనకు ఇష్టమైన వాటిని పెంచుకుంటూ, ఇష్టంలేని వాటిని తొలగించుకుంటే అప్పుడు బాబా వచ్చి, ఆనందంగా ఇదిగో ఇక్కడ మీ స్వంత ఫ్లాట్‌లో (హృదయంలో) ఉంటారు.** - ***శ్రీబాబూజీ***




## శ్రీబాబూజీ

**(*శ్రీరామనవమి సంచిక తరువాయి*)** గురువుగారు వ్రాసిన సంకలనాన్ని చూసిన ఒక ముసలాయన, ఈ ఆర్టికల్స్ ఎవరో తలపండిన వ్యక్తి ఎంతో అనుభవంతో వ్రాసినది అని నాతో అన్నారు... దానికి నేను మీ వయస్సులో సగం వయస్సు, అనుభవంలో మీలో సగం ఉంది, కాని ఒక్కటి మాత్రం నిజం. వారు తలపండినవారు కాదు, తలపులు పండిన వారని నేను సమాధాన మిచ్చాను. అటువంటి మహనీయుని తప్పక దర్శించాలని, వారితో సంభాషించాలని, తనకున్న సందేహాలను తీర్చుకోవాలని ఉవ్విళ్ళూరాడు. అప్పుడు నేను మీకు ఏ విషయంలో సందేహము ఉన్నా సరే అది ప్రాపంచిక సమస్యగానీయండి, ఆధ్యాత్మిక సంశయం కానీయండి చిటికెలో తీర్చగల దిట్ట మా గురువుగారని అన్నాను. భగవంతుడంటే నమ్మకమున్న ఆస్తికులతోనేగాదు, హేతువాదులతోను, నాస్తికులతోను మాట్లాడి వారితో మొండిగా వాదించకుండానే ఓర్పుగా, నేర్పుగా వారిని తన మార్గంలో త్రిప్పుకోగలరాయన అని అన్నాను. మామూలుగా మీబోటి వారు ఆచరించి, అనుసరిస్తున్న మార్గం కాదు వారు చూపేది. ఏ విధమైన బాహ్యాడంబరాలు లేకుండా ఆచారవ్యవహారాలు లేని విలక్షణ మార్గం వారు మాకు బోధించేది. మన మనస్సులలోని గుణదోషాలను గుర్తింపచేసి వాటిని పోగొట్టుకుంటే తప్ప మనం ఏ సాధన చేసినా ఫలించదు. ముందు మనం సాధించవలసింది మనలోని కల్మషాలను గుర్తించి పోగొట్టుకోవడం, పోగొట్టుకోలేకపోతే మనం ఆశ్రయించిన సద్గురువును శరణాగతి పొంది పోగొట్టమని ప్రార్థించడమే. **సాధన అంటే ఏదో రోజులో కొంతకాలాన్ని దానికోసం వెచ్చించడం కాదు, జీవితంలో సాధన ఒక భాగం కాదు. సాధనలో జీవితం భాగం కావాలి అని అంటారు.** ఏ విధమైన నియమనిబంధనలు లేకుండా మనిషిని స్వేచ్ఛగా ఆలోచింపచేస్తూ దేనికీ బందీలను కానీయకుండా మనలోని సంస్కారాలను సంస్కరిస్తూ మనకు తెలియకుండానే మనచేత సాధన చేయిస్తారు అని అన్నాను. నా మాటల వలన వారికి ఏమి అర్థమయిందోగాని, ఇప్పటి కాలానికి సరైన మార్గం చూపి, గమ్యం చేర్చే సద్గురువు వారు అని నాకనిపిస్తుంది. వారిని చూడకపోయినా మీ మాటలను బట్టి వారు వయస్సులో చిన్నవారైనా జ్ఞానంలో గొప్పవారనిపిస్తుంది. నేను వయస్సులో పెద్ద అయినా జ్ఞానంలో పెద్ద అయిన వారికి సాష్టాంగ నమస్కారాలు చేస్తున్నాను. భగవంతుని కృపతో తప్ప అటువంటి మహనీయుల దర్శనభాగ్యం లభించదు. వారిని గురించి తెలుసుకోవడం నా పూర్వజన్మ అదృష్టం అని, మీరు గురువుగారిని



**గురువు చెప్పినట్లు చేయడమే మనం చేయాల్సిన సాధన. ఇదే మనం గురువుకి సమర్పించే నిజమైన దక్షిణ.**





కలిసినపుడు నా నమస్కారాలు తెలపండి అని ఎంతో వినయపూర్వకంగా పలికారు. వారిని కలవడం యాదృచ్ఛికం కాదని బాబా నిర్ణయమని అనిపించింది.

బాబాను ధ్యానించే పద్ధతులు ఎన్ని ఉన్నా గురువుగారి పద్ధతి ప్రత్యేకతను సంతరించుకొని ఉంటుంది. బాబా పలు సందర్భాలలో వివిధ భక్తులతో నుడివిన సూక్తులను ఆచరణపూర్వకంగా నిజజీవితంలో ఆచరించడం వారి ప్రత్యేకత. **"సత్యాన్ని అంటిపెట్టుకో. నేనెప్పుడూ నీ చెంతనే ఉంటాను"** అన్న సూక్తి గురువుగారి జీవితానికి నేపథ్యంగా ఉంటుంది.

వారు అబద్ధం చెప్పరు సరికదా! అబద్ధం చెప్పినవాళ్ళు అంటే వారికి అసహ్యం. జీవితంలో ఏ పెద్ద తప్పునయినా క్షమిస్తారుగాని, అబద్ధం చెపితే మటుకు క్షమించరు. సత్యం పట్ల వారికున్న ఎనలేని ప్రీతికి సంకేతం– వారి కలంపేరు **'సత్యకామ'** అని పెట్టుకోవడం. (సత్యంపట్ల కోరిక కలిగినవారు)

ఒకరు మనకు ఏ విషయమైనా చెప్పి తిరిగి దానిని వేరే వ్యక్తికి చెప్పమన్నప్పుడు మన లోపాలు బయటపడతాయి. చెప్పిన విషయాన్ని శ్రద్ధగా వినడం ఒకటి. ఏ విధమైనా కాంప్లెక్స్ అతనిపైగాని, మనం చెపితేవినే వ్యక్తిపైగాని లేకుండా ఉండటం. మన సొంతపైత్యం లేకుండా విషయాన్ని జ్ఞాపకం పెట్టుకొని చెప్పగలగడం కూడా సత్యం పకలడమే అవుతుంది. ఏ విషయమైనా మనం మర్చిపోయినా, లేక ఏదైనా కొద్దిగా కల్పించి చెప్పేటప్పుడు వారు వినే పద్ధతిలోనే మనం చెపుతున్న దాంట్లో సత్యం లేదనే విషయం మనకు అర్థం అయ్యేట్లు గురువుగారు చెప్పక చెపుతారు.

రామకృష్ణ పరమహంస జీవితం నుండి స్ఫూర్తి పొంది, రామకృష్ణులు దేన్నైనా ఇవ్వడానికి చివరకు ప్రాణాన్నైనా కాళికాదేవి ప్రత్యక్షమైనపుడు ఇవ్వడానికి ప్రిపేర్ అయ్యారుగాని సత్యాన్ని ఇవ్వడానికి నిరాకరించారు. వారికి సత్యంపట్ల ఉన్న భక్తి, శ్రద్ధలు నిరుపమానం అంటారు గురువుగారు. గాంధీ మహాత్ముడన్నా గురువుగారికి ఎంతో గౌరవం. కారణం వారి సత్యసంధత, వారి త్యాగనిరతి, వారి ధృడదీక్ష.

ఒక సందర్భంలో నేను వారికి భయపడి, అబద్ధం చెప్పడానికి ప్రిపేర్ అవుతుండగా, ఇంకా మాటల రూపంగా ఆలోచన రాకముందే వారు కోప్పడి ఏమనుకుంటున్నారు, **ఆలోచన పుట్టే సోర్స్ కన్నా ఇంకా డీప్‌గా ఉన్నాను** అని అన్నారు. ఆ స్థితిని నాబోటి అల్పుడు ఊహించనుకూడా




ఊహించలేదు.

**శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన సద్గురువు వద్దకుపోయి బ్రహ్మజ్ఞానాన్ని పొందాలని పెద్దల మాట. రెండు విశేషణాలు ఒకే వ్యక్తిలో మూర్తీభవించి ఉండటం చాలా కష్టం. శాస్త్రాలు తెలిసిన వ్యక్తి ఆ వాసనలో పడి బ్రహ్మజ్ఞానం పొందడం జరగదు. బ్రహ్మజ్ఞానానికి శాస్త్రాలలో ప్రవేశం ఉండటం బహు అరుదు. అలాంటి అరుదైన గురువును మనకు ప్రసాదించిన సమర్ధ సద్గురు సాయినాథునకు శతసహస్ర వందనాలు.**

సామాన్యంగా ఆధ్యాత్మిక రంగంలో వున్న గురువులు, పీఠాధిపతులు, సన్యాసులు ఉపయోగించే పదాలైన ప్రారబ్ధము, కర్మ, అజ్ఞానం, జ్ఞానం, ఆత్మ, పరమాత్మ, ముక్తి, మోక్షం లాంటి వాటిని గురూజీ ఎప్పుడూ ఉపయోగించరు. థియరీ కన్నా ప్రాక్టికల్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఏ విషయమైనా ఉపన్యాసంగాగాని, బోధరూపంగాగాని తేవడం ఉండదు.

బాహ్యమైన క్రియలు కాని తంతునుగాని ఎప్పుడూ ప్రోత్సహించరు. చేస్తే మానసికపూజ చేసుకోతప్ప బాహ్య ఆడంబరంతో పూజ తగదు అంటూ దానివలన మనలో అహంకారం పెరగడం తప్ప మనలో ఏ విధమైన (మానసికంగా) మార్పురాదని అంటుంటారు.

ముక్తి, మోక్షం అనేవాటికి అస్సలు ఇంపార్టెంట్ ఇవ్వరు. స్వర్గం, నరకం అవి ఉన్నాయో లేదో తెలియదు. అసలు ఎప్పుడైనా మనం వాటిని రుచి చూచామా వాటిని కోరడానికి. ఏదో తెలియని దానిని కోరుకోవడం వట్టి భ్రమ. ప్రస్తుతం మన సమస్య ఏమిటి దాన్ని గుర్తించి ఆ సమస్యను తీర్చమని అడుక్కోవడమే. అలా మనలోని ప్రతి చిన్న కోరికనూ గమనించుకొని మనకేమి కావాలో అప్పటికి అడిగి తీర్చుకోవడమే. ఇలా మనకు కావల్సినవన్నీ కోరి, అన్నీ తీరిన తరువాత ఏ కోరికా లేని స్థితికి చేరుకోవడమే మనకు బాబా నేర్పేది. అందుకే బాబా అన్నారు **"నేను వచ్చింది మీ కోరికలు తీర్చడానికే"** అని అంటారు గురూజీ.

ఫుల్‌ఫిల్‌మెంట్ అంటే చనిపోయిన తరువాత వచ్చేది కాదు. ఏ చిన్న కోరిక మనలో కలిగినా మనలో ఒక గ్యాప్ ఏర్పడుతుంది. ఆ గ్యాప్ నింపుకోవడానికి పడే తపన వలన ఆ కోరికను తీర్చమని బాబాని అడిగి వారి ద్వారా ఆ కోరిక తీర్చుకొని మనలోని గ్యాప్‌ని ఫుల్ చేసుకోవడమే మనం చేసుకోవలసిన సాధన. బాబాను ప్రతి చిన్న కోరికను మనం కోరి తీర్చుకుంటుంటే చివరికి



కృపాహి కేవలం

ఎటర్నల్ ఫుల్‌ఫిల్‌మెంట్ లభిస్తుంది. ఫుల్‌ఫిల్ అంటే నిండుగా నింపుకోవడం అని ఆ పదానికి అర్థం చెపుతూ అది ఎలా పొందాలో చెపుతారు గురూజీ.

అసలు గురువుగారు ఏ విషయం గురించైనా చెప్పేముందు ఆ పదానికున్న అర్థాన్ని, ప్రతిపదార్థాన్ని, తాత్పర్యాన్ని, భావాన్ని చెబుతారు. దానితో మనకు సగం అర్థమవుతుంది. ఆ అర్థమయిన బేసిస్ మీద మిగిలిన విషయం వింటే అది సూటిగా హృదయాన్ని తాకి ఇంకెక్కడికీ పోలేదు. ప్రతి విషయాన్ని అరటిపండు వలిచి నోట్లో పెట్టినట్లు చెప్పే వారి ప్రతిభ అమోఘం.

హిందూమతానికి ప్రామాణిక గ్రంథమైన భగవద్గీత నుండి ఏ ఆధ్యాత్మిక గ్రంథం తీసుకున్నా ఇహం వేరని పరం వేరని, ఇహంలో మనం ఎంత కష్టపడితే పరం అంతగా లభిస్తుందని, శరీరాన్ని, మనస్సును కష్టపెట్టుకోవడమే సాధన అని మనం చిన్నప్పటి నుండీ వింటూ, చదువుకుంటూ ఉంటాము. ఆ గ్రంథాలను ఆశ్రయించుకున్న స్వాములు, సన్యాసులు కూడా ఆ విషయాన్నే నొక్కి నొక్కి వక్కాణిస్తూ ఉంటారు. తరతరాల నుండి ఈ విషయం మన నరనరాలలో జీర్ణించుకొనిపోయి మనం దీనికి వ్యతిరేకంగా ఏమి విన్నా త్వరగా అంగీకరించలేము. అటువంటి మూఢభావాలు గల నేను గురువుగారి వద్దకు వచ్చేవరకు అలాంటి భావంతో ఉంటూ ఎన్నో భాధలను అనుభవించాను. గురువుగారు బాబా జీవిత చరిత్రలోని లీలల ద్వారా బాబాతత్త్వాన్ని తమదైన శైలిలో చెపుతున్నపుడు ఎన్నోసార్లు ఇహపరాలు వేరుగాదని, ఇహంలో సాధించలేనిది మనం పరంలో ఏమి సాధించగలుగుతామని, పరం ఉందోలేదో, మనకు పనిలేదని, ఇహంలో మనం అనుభవించే అనుభవమే ముఖ్యమని చెప్పేవారు. ఈ విషయాన్ని బోధిస్తున్నట్లు కాకుండా డిస్కషన్స్‌లో చెప్పేవారు. వారు బోధించే గురువుగా మనం వినే శిష్యులుగా ఎన్నడూ భావించరు. సర్వత్రా నిండి వున్న చైతన్య స్వరూపంగా అందరినీ చూస్తానన్న భగవాన్ శ్రీరమణమహర్షి వాక్యం అక్షరాలా గురువుగారి విషయంలో నిజమయింది. అందుకే వారు మనలను వేరుగా చూడరు. తన ప్రతిరూపాలుగా చూస్తారు. అజ్ఞానంతో కొట్టుకుంటున్న మనకు సాక్షాత్ బాబానే వచ్చి మీ భావం తప్పు, నిజమైన సత్యం ఇది అని చెప్పినా వినమేమో. అలాగే సాక్షాత్ సాయినాథుని స్వరూపులైన గురువుగారు బాబా బోధ ఇది. దీన్ని ఆచరిస్తే మీరు సుఖశాంతులతో ఉంటారు అని చెప్పినా మనం వినం. జన్మజన్మల నుండి పేరుకొని వున్న అజ్ఞానం యొక్క బలం అది. కాని తుప్పుపట్టిన ఇనుము అయస్కాంత సంపర్కం




వలన ఏదో ఒకనాటికి తనలోని సహజమైన ఇనుపగుణం పోయి అయస్కాంతతత్వాన్ని పూర్తిగా పొంది చివరకు అయస్కాంతం ఎలా అవుతుందో అలాగే మనం నిరంతరం గురుదేవుల సన్నిధిలో ఉంటూ వారి బోధను అర్థం చేసుకొని, ఆచరించగలిగితే మనమూ వారి కృపకు పాత్రులమై ఆనందస్వరూపులం అవ్వగలము.

ఇప్పుడు మనకున్న సమస్యలను పోగొట్టుకుంటూ మనలోని కోరికలను తీర్చుకుంటూ ఎటువంటి దుఃఖం లేని జీవితాన్ని గడపడమే బాబా మార్గం అని గురువుగారు చెప్పేంతవరకు అర్థం కాలేదు. అందుకే సమగ్రమైన వారి బోధను గురువుగారి ద్వారా మనకు ప్రసాదించి మనలను శుభ్రమార్గాన నడిపిస్తున్నారు బాబా.

**బాబా తమ అవతార ప్రయోజనమైన సర్వమానవ సౌభ్రాతృత్వము, నిజమైన ఆధ్యాత్మిక మార్గాన్ని మనచేత ఆచరింపచేయడం, మతసామరస్యంలాంటి మహత్తరమైన అంశాలను మానవాళికి బోధించి, ఆచరింపచేయడానికి వారు ఎన్నుకున్న ఉపాధి గురువుగారు. వారి మహిమను నిదర్శనాపూర్వకంగా లోకానికి చాటి బాబాపట్ల కృతజ్ఞతో వారి మార్గాన్ని అనుసరించాలంటే సాక్షాత్ బాబా స్థితిని పొందిన జీవన్ముక్తులైతే తప్ప వీలుపడదు. నిరంతరం బాబా స్థితిలో ఉన్న మహాత్ములైతే తప్ప సద్గురు సాయినాథుని మహిమకు సాక్ష్యం చెప్పలేరు. "భగవంతుని మహిమకు సాక్ష్యం చెప్పడానికి వచ్చారా బాబా" అని దాసగణు అన్నట్లు, బాబా మహిమకు సాక్ష్యం చెప్పడానికి అవతరించిన రూపం మన గురువుగారు అని నా భావం. వారి మహిమను చవిచూసిన ఎవ్వరైనా సరే ఈ మాటను ఒప్పుకోవలసిందే.**

అసంఖ్యాకమైన అనుభవాలు, మహిమలు బాబా ద్వారా జరుగుతున్నా, చేసేది చేయించేది అల్లానే, అల్లామాలిక్ హై, అల్లా అచ్ఛాకరేగా, అల్లాభలాకరేగా అనేవారు తప్ప ఇదంతా నా ప్రతిభ అని ఎప్పుడూ బాబా అనలేదు. సరే వారి గురువుగారి గురించి చెపుతూ ఈనాటి ఈ ప్రతిభకు కర్తలు వారే. వారి ఆశీస్సుల ఫలితమే ఇదంతా అని అన్నారు.

ఎందరో ఆర్తులు వారి కష్టాలను గురువుగారికి నివేదించుకుంటే బాబా దయవలన మీ కష్టాలు తీరుతాయి. బాబా మీకు మేలు చేస్తారు. బాబాను నమ్ముకో అని అంటారు తప్ప, "నీకు తగ్గిపోతాయి పో, నీవు ఇది చెయ్యి, తగ్గిపోతుంది. ఈ మంత్రం జపించు తగ్గిపోతాయి" అని ఎప్పుడూ చెప్పరు



సరిగదా! వాటి వలన ఏమి ప్రయోజనం ఉండదు. సంపూర్ణంగా బాబా మీద విశ్వాసం ఉంచి ఓర్పుతో బాబా మీద భారం వేసి నిశ్చింతగా ఉండండి. అందరి కష్టాలు తీర్చేదీ, కోరికలు నెరవేర్చేది బాబానే అని అంటారు.

గురువుగారి నామం ఉచ్చరించినా, వారికి జేజేలు పలికినా ఎంతో కోప్పడతారు. బాబానే మనందరికీ దేవుడు. ఆయన నామం కీర్తిద్దాం. వారికి జేజేలు పలుకుదాం అని అనడమే కాదు, సాయిబాబా నామాన్ని అత్యద్భుతంగా చెపుతూ మనలను ఎలుగెత్తి చెప్పమంటారు. బాబానామం పట్ల వారికున్న ప్రీతి జగత్తులో మరి దేనిమీదా లేదు. నిరంతరం సాయినాథుని స్మరణ చేసి వారే సాయి అయ్యారు.

అరుణాచల క్షేత్రంతో గురువుగారికి ఉన్న అనుబంధం వలన శిరిడీ తరువాత ఎక్కువరోజులు అక్కడ గడుపుతుంటారు. సుగంధ పరిమళంతో కూడిన పుష్పం పొదలో ఎక్కడ దాగున్నా, దాని వాసన చుట్టుప్రక్కల ఎంతో దూరం వ్యాపించడం వలన ఆ పొదను చేరుకొని ఆ పుష్పాన్ని తమదిగా చేసుకుంటాము. అలాగే జ్ఞానభాస్కరులైన గురువుగారు ఎంత ప్రకటం కాకుండా దాక్కున్నా వారి వెలుగును దర్శించి, వారి సముఖానికి వచ్చినవారెందరో. ఎక్కువగా విదేశీభక్తులు రమణభగవాన్‌కీ గురువుగారికీ ఉన్న ఋణానుబంధంగా గురువుగారి వద్దకు భగవాన్ పంపినట్లుగా వచ్చారు. వారు గురువుగారిని ఎన్నో ప్రశ్నలు వేసేవారు. వాళ్ళు చదివిన భగవాన్ చరిత్ర నుండి కొన్ని, శాస్త్రాల నుండి కొన్ని ఎన్నో రకాల ప్రశ్నలను గురువుగారిని వేసేవారు. వారు అడిగిన వాటికి గురువుగారు ఎంతో ఓర్పుగా, నేర్పుగా సమాధానం చెప్పేవారు. అన్నింటికన్నా ఆశ్చర్యపరిచే విషయం విదేశీయులు అడిగిన ప్రశ్నలకు గురువుగారు అనర్గళంగా ఇంగ్లీష్‌లో సమాధానాలు చెప్పడం. రకరకాల దేశాల నుండి వచ్చినవాళ్ళ ప్రనౌన్సేషను మామూలుగా మనకు అర్థం కాదు. గురువుగారు అందరి ప్రశ్నలు విని వాళ్లకు తగ్గట్టు సమాధానాలు చెప్పడం ఎంతో ఆశ్చర్యం వేసేది. కేవలం ప్రాపంచికమైన విజ్ఞానం మాత్రమే చాలదు. దీనికి అతీతమైన జ్ఞానం ఏదో ఉంటే తప్ప ఇలా సమాధానం చెప్పడం కుదరదు.

ప్రీ వేదిక్ కల్చర్ నుండి ఇప్పటివరకున్న ఆధ్యాత్మిక గ్రంధాలను అన్నింటినీ ఔపాసన పట్టి ఉంటే తప్ప అంత విజ్ఞానం కలిగి ఉండటం సాధ్యం కాదు. కేవలం పఠనమే కాకుండా జిజ్ఞాసతో ప్రతి విషయాన్ని కూలంకషంగా ఔపాసన పట్టి ఉంటే తప్ప ఎవ్వరు ఏ సబ్జెక్టులో ఏ ప్రశ్న వేసినా అలా




సమాధానం చెప్పడం వీలుపడదు. విదేశాలలో పుట్టి మన దేశానికి వచ్చి మన సంస్కృతి, సాంప్రదాయాలు పాటిస్తూ మన మతంలో మనకి తెలియని ఎన్నో విషయాలను చదివి, అర్థం చేసుకొని వాటిలో వారికి వచ్చిన అనుమానాలను నివృత్తి చేసుకుంటున్న వాళ్ళను చూస్తే నాకు ఎంతో సిగ్గనిపించింది. వారిలో ఉన్న తృష్ణ కారణంగానే వాళ్ళు గురువుగారి వంటి జ్ఞానుల వద్దకు రాగలిగారని అనిపించింది.

భగవాన్ జీవితాన్ని చదివిన ఎవ్వరికైనా వారి మార్గం 'హూ ఆమ్ ఐ' (నేనెవరు) అనిపిస్తుంది. ప్రతి విషయానికి వారు మహామంత్రంగా దీన్ని చెప్పారని అనిపిస్తుంది. ఎవ్వరు ఏ ప్రశ్న వేసినా సరే 'ఆ ప్రశ్న వేసింది ఎవ్వరో చూడు' అనేవారు. భగవాన్ అంటే 'నేనెవరు?' అని గుర్తువచ్చేంతగా వారి నోటి నుండి వెలువడిన మాట అది. ఆ విషయం గురించి విదేశీయులందరూ గురువుగారిని అడిగేవారు. మీరేం చేస్తున్నారని గురువుగారు అడిగితే మేము 'హూ ఆమ్ ఐ' చేస్తున్నామని చెప్పేవారు. భగవాన్ మార్గం జ్ఞానమార్గమని, వారి బోధ అంతా జ్ఞానమార్గం గురించే అని, జ్ఞాని అంటే భగవానే అని, మనం జ్ఞానం పొందాలంటే భగవాన్‌ని ఆశ్రయించి తీరాలని వాళ్ళ కాన్సెప్ట్‌ని గురువుగారితో డిస్కస్ చేసేవారు. వాళ్ళ దృష్టిలో, గురువుగారికి భగవాన్‌ని గురించి వాళ్ళు తెలపుతున్నారని భావం. వాళ్ళు చెప్పినదంతా ఓపికగా వినేవారు గురువుగారు. వాళ్ళు చెప్పిన విషయంలోనే ప్రశ్నించేవారు. వాళ్ళు సమాధానం చెప్పలేకపోతే భగవాన్ లైఫ్‌లోని ఒక ఇన్సిడెంట్‌ని తీసుకొని దాని నుండి వారికి సమాధానం చెప్పేవారు. వాళ్ళకు ఎంతో ఆశ్చర్యం వేసేది. ఎలా తెలుసునా గురువుగారికి ఇదంతా అని. వాళ్ళకు నిజమైన భగవాన్‌ని చూపించి, వాళ్ళుపోయే మార్గంలో ఉన్న అడ్డంకులను తొలగించి, వాళ్ళ మార్గాన్ని సుగమం చేసారు. ప్రతి విషయంలోనూ అప్పటివరకూ చూసినది తప్పు. ఇది సరైన విధానం అని వాళ్ళకు తెలిపి, "రి డిస్కవరీ ఆఫ్ భగవాన్" అని వాళ్ళకు భగవాన్ పట్ల ఉన్న దృక్పథాన్నే మార్చేవారు.

ఇంటలెక్చువల్‌గా కాదు భగవాన్‌ని చూడవలసింది, వారిపట్ల ఎమోషనల్ ఎటాచ్‌మెంట్ డెవలప్ చేసుకోవాలి అని చెప్పి ఆ ఎటాచ్‌మెంట్ డెవలప్ చేసుకోవడానికి ఏమి చేయాలో చెప్పేవారు గురువుగారు. ఇంతవరకు మీరు చదివిన బుక్స్‌ని ప్రక్కనపెట్టి వారితో అనుబంధాన్ని పెంచుకునే పుస్తకాలను (భగవాన్ స్మృతులు, సూరినాగమ్మ లేఖలు) ఇంగ్లీష్ తర్జుమా అయిన వాటిని చదువుకోమని


**ప్రతిక్షణం అనుభూతి చెందుతూ, జీవితాన్ని అద్భుతంగా, పరిపూర్ణంగా జీవించేలా చేస్తుంది ఆధ్యాత్మికత.**




చెప్పేవారు. భగవాన్ సన్నిధికి ప్రదక్షిణలు చేసి, వారి సన్నిధిలో కాసేపు కూర్చోండి అనేవారు. గురువు చెప్పిన విషయాన్ని వెంటనే పాటించి, ఇన్ని సంవత్సరాలు ఇక్కడికి వచ్చి, పొందలేని అనుభవాన్ని మేము ఇప్పుడు పొందుతున్నాము. ధ్యానం అంటే ఏమిటో ఇప్పటికి మాకు అర్ధమయ్యింది. ఇప్పటివరకు మేము చేసినదంతా వ్యర్ధము. ఇప్పటికి మా అదృష్టం కొద్దీ సద్గురువు లభించారు. మమ్మల్ని ఉద్ధరింపచేయడానికి భగవాన్ పంపిన సమర్ధ సద్గురువు వీరు అనే అవగాహనకు వచ్చారు. సామాన్య ప్రపంచంలో ఎవ్వరైనా సరే వాళ్ళ వాళ్ళ సాంప్రదాయంలో ఉంటూ వేరే గురువుగారి వద్దకు పోయినపుడు నేను చెప్పేది సరైన మార్గం అని పాతసాంప్రదాయాన్ని వదిలిపెట్టి తమ మార్గంలో రమ్మని గురువులు చెప్పడం చూస్తాం. కాని ఇక్కడ ఎవ్వరైనా సరే వాళ్ళ మార్గాన్ని వదలవలసిన పనిలేదు. వాళ్ళు పోయే మార్గంలోని అడ్డంకులను తొలగించుకొని, ఆ మార్గంలో ఆనందంగా పొండి అని అనడం జరిగింది. అది విదేశీయులకు చాలా ఆశ్చర్యం కలిగించిన విషయం.

సాయిబాబాను పూజిస్తూ, భగవాన్ రమణుల గురించి ఇంత ఎనాలసిస్‌తోను, అంత ఎమోషనల్‌గా చెపుతున్న గురువుగారిని ఇద్దరికీ ఉన్న బేధం ఏమిటి అని అడిగితే నా ఉద్దేశ్యం ప్రకారం భగవాన్ షోయింగ్‌పాత్, ది గోల్ ఈస్ సాయిబాబా అని చెప్పారు. ఎవ్వరైనా బాబా గురించి అడిగితే చెప్పేవారు గాని, వారంతటవారు ప్రచారంగా బాబా గురించి చెప్పేవారు కాదు. అదీ వాళ్ళు అడిగే అవసరాన్ని బట్టి సమాధానం ఉంటుంది. వారు అపారమైన విజ్ఞానఖని అయినా సరే బయటకు ఎవరికీ తెలియదు. వారిలోని విద్వత్తు, జ్ఞానరత్నాలు కోకొల్లలు ఉన్నాయి. వాటి కోసం వచ్చేవాళ్ళే లేరు. వచ్చినా నకిలీరాళ్ళను కోరుకునేవారేగాని నిజమైన రత్నాలను అడిగేవాళ్ళు లేరు. ఎవ్వరైనా ఏదైనా మాట్లాడితే సమాధానం చెప్పడానికి నోరుతెరుస్తారు తప్ప నాకు ఇంత తెలుసని లెక్చర్లు కొట్టడం గురువుగారి ఫిలాసఫీ కాదు.

భగవాన్ మార్గం కేవలం జ్ఞానమార్గం కాదని తమ తల్లిగారికి అనారోగ్యంగా ఉన్నప్పుడు వారు ఎంతో ఆర్తితో అరుణాచల పదికాన్ని వ్రాసి పాడి వారిలో వున్న భక్తితత్వాన్ని అందరికీ ఎత్తిచూపారు. భగవాన్ శ్రీరమణమహర్షిని పరిపూర్ణ మానవత్వం మూర్తీభవించిన ఒక మానవోత్తముడుగా గురువుగారు ప్రెజెంట్ చేసే పద్ధతిగాని, ఎన్నో సన్నివేశాలలో భగవాన్ రియాక్షన్ టూవర్డ్స్ హ్యూమన్




బీయింగ్‌మీదగాని, జీవులపట్లవారి ప్రేమ, కరుణ, దయగాని గురువుగారి నోటి నుండి వింటుంటే కళ్ళనీళ్ళు రాక మానవు. భగవాన్ గురించి ఎంత ఆవేశపూరితంగా చెపుతారంటే భగవాన్‌పట్ల గురువుగారికున్న అకుంఠిత భక్తి, గౌరవం అపారం. వారి భక్తికి సంకేతంగా భగవాన్ 'ఆత్మకథ'ను ఇంగ్లీష్‌లో వ్రాసారు. అది ఇప్పుడు ఎందరో విదేశీయులకు పారాయణ గ్రంథం అయ్యింది. విదేశీయులతో సత్సంగాలు ముమ్మరంగా జరుగుతూ వాళ్ళు అడిగిన ప్రశ్నలన్నింటికీ ఎవరికి తగ్గట్లు వాళ్ళకు సమాధానం చెపుతూ రోజురోజుకీ సత్సంగానికి వచ్చేవారి సంఖ్య పెరిగిపోసాగింది. ఎవ్వరు ఏ సబ్జెక్టులో అడిగినా సమాధానం వచ్చేది. ఎక్కువగా హిందూ ఫిలాసఫీ గురించి అడిగేవారు. ఎన్నో ప్రమాణాలను చూపుతూ అందరి ప్రశ్నలకు సమాధానం చెప్పేవారు. ఒకరోజు క్రిష్టియానిటీ గురించి వచ్చింది. వాళ్ళ రిలిజియన్ అయినా వాళ్ళకు తెలియని ఆధ్యాత్మిక రహస్యాలను ఎన్నింటినో గురువుగారు వాళ్ళకు చెబుతుంటే నోరు వెళ్ళబెట్టారు. ఇంత నాలెడ్జ్ వీరికి ఎలా వచ్చిందని ఎంతో ఆశ్చర్యపోయారు. వాళ్ళలో కొందరు బుద్ధిష్ట్ ఫిలాసఫీని ఫాలో అయ్యేవారు. వాళ్ళు ఫాలో అయ్యే పాత్‌లోని ఎన్నో సందేహాలను నివృత్తి చేసి వాళ్ళు పోయే మార్గాన్ని సుగమం చేసారు. ఒక వ్యక్తి ఇన్ని రిలీజియన్స్ గురించి కూలంకషంగా చెప్పగలగడం ఎంతో అరుదైన విషయం. **అపారమైన జ్ఞానం, తృష్ణ గల వ్యక్తి తమ వద్దకు వస్తే వారికి జ్ఞానాన్ని పంచాలన్న ఆశయం, అందరూ సుఖసంతోషాలతో జీవించాలనే ఆశ, ప్రతి వ్యక్తి జీవితాన్ని ఆనందంగా గడపగలగాలనే ఆకాంక్ష గల ఒక మహోన్నత వ్యక్తిగా విదేశీయులందరికీ ప్రేమపాత్రులైనారు**. వాళ్ళలో ఉన్న గురువు కొరకు పడే తపన, అన్వేషణ మన గురువుగారిని కలిసి, మాట్లాడి, సమాధానపడి వారి గైడెన్స్‌తో సాధన చేసుకుంటూ జీవితానికి ఒక ఆలంబన దొరికిందనే సంతోషంతో ముగిసింది. (తరువాయి భాగం విజయదశమి సంచికలో)

**– డా॥ శ్రీనివాసులురెడ్డి**

**ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ సద్గురువు ఉంటారు. కాని ఏ రూపంలో ఉన్నారనేది తెలియపరచడానికి తగిన సమయం ఎన్నుకుంటారు. అక్కడ సద్గురువును తెలుసుకునే సమయం మన ఇష్టానుసారం ఉండదు. నీ ఎరుకలో లేకపోయినా, సద్గురువు యొక్క ప్రభావం నీ పట్ల ప్రసరిస్తూనే ఉంటుంది.** ***– శ్రీబాబూజీ***



కృపాహి కేవలం

# నీ కొరకు నేను నావనౌతాను

ఈ జగత్తు ఒక నాటకం. ఇది జగన్నాటకం. అనాదిగా పెద్దలందరూ ఈ జగత్తును నాటకంగా అభివర్ణిస్తూనే ఉన్నారు. అయితే ఈ జగన్నాటకంలో ఒక చిత్రమయిన విశేషముంది. ఈ సృష్టిలో ఎవరికివాడు ప్రేక్షకుడు. మిగిలిన జగత్తు అతడికి నాటకం. నాటకాన్ని చూస్తూ ప్రేక్షక స్థానంలో ఉన్న మనం సరసమయిన శిక్షణ పొందాలి. పూర్ణమయిన క్షాళన పొందాలి. ముక్తజీవిగా వెలుగొందాలి. మానవత్వాన్నుండి దివ్యత్వాన్ని సంతరించుకోవాలి. పశుత్వం నుండి మానవత్వానికి, మానవత్వం నుండి దివ్యత్వానికి, దివ్యత్వం నుండి సాక్షాత్తు దైవస్వరూపమై నడయాడడానికి కావలసిన పరిణామమంతా ఈ జగన్నాటక దర్శనం నుండి పొందాలి.

నాటకంలో మంచిపాత్రలూ ఉంటాయి. చెడ్డపాత్రలూ ఉంటాయి. పుణ్యవర్తనులూ ఉంటారు. పాపాచరణపరాయణులూ ఉంటారు. జగన్నాటకంలో ఈ వైవిధ్యం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. ఇటు పుణ్యమూర్తులు, అటు పాపాత్ములూ లెక్కకు మిక్కిలిగా కొట్టొచ్చినట్లుగా కనబడతారు. అప్పుడా జగన్నాటకానికి ప్రేక్షకుడిగా నున్న మనం ఏం చేయాలి! ఆ అధ్యయనం రసభరితంగా సాగాలి! నీరసభరితంగా ఉండకూడదు. రసభరితంగా సాగాలి, సాగాల్సి ఉంది, సాగుతుంది. కాబట్టే ఇది జగన్నాటకం అని మరల మరల చెప్పబడుతోంది. నాటకం రసభరితం కదా మరి! రసానందస్థితిని అనుభవిస్తూనే, ఆ తాదాత్మ్య స్థితిలో నుండే కావలసిన సందేశాన్ని మనం అందుకోవలసి ఉంటుంది. అప్పుడే మన జీవితానికి, ఈ మానవ జీవితానికి సార్ధకత.

నాటకం జరుగుతూ ఉంటుంది. ఆ నడుస్తున్న జగన్నాటకంలో పుణ్యాత్ములూ, పాపాత్ములూ వర్తిస్తూ ఉంటారు. నర్తిస్తూ ఉంటారు. పుణ్యాత్ముల పాత్రలు చూస్తున్నపుడు ఎలా ప్రవర్తించాలో తెలుస్తుంది. పాపాత్ముల పాత్రలను చూస్తున్నపుడు ఎలా వర్తించకూడదో తెలుస్తుంది. పుణ్యాత్ముల పాత్రలను తలచుకొంటూ ఉండాలి. మెచ్చుకుంటూ ఉండాలి. ఒకరకంగా ఆ పుణ్యాత్ముల పాత్రలను ఆరాధించాలి. అనుసరించాలి. అలా చేయడం ద్వారా మనకు తెలియకుండానే మనం కూడా పుణ్యాత్ములుగా రూపొందుతాం. అయస్కాంత స్పర్శతో ఇనుప ముక్క కూడా అయాస్కాంతమై వర్తించినట్లుగా!

ఇక జగన్నాటకంలో పాపాత్ముల సంగతి! వారిని చూస్తున్నపుడు ఎలా వర్తించకూడదో మనకు తెలుస్తూ ఉంటుందని చెప్పుకున్నాం. ఎన్ని విధాలుగా పాపాచరణ ఉంటుంది, దాని ప్రవర్తన ఎలా




ఉంటుంది. దాని ఫలితాలు ఎలా ఉంటాయి. ఆ ఫలితాలు అనుభవానికి వస్తున్నవేళ ఎలా ఉంటుందీ! ఈ అంశాలు కూడా. జగన్నాటకంలోని పాపాత్ముల పాత్రలు మనకు తెలియచెబుతాయి. అనుభవానికి తెస్తాయి. 'మీరు ఇలా ఉండకండి సుమా!' అని హెచ్చరిస్తాయి. 'మాలా ఇలా అయిపోకండి సుమా!' అని జాగ్రత్తలు చెబుతాయి. పాపాచరణలోని లోతుపాతులను మన కళ్ళకు కట్టిస్తాయి. పాపాచరణలోని లోటుపాట్లను మనం గ్రహించి, వాటి నుండి మనకు కావలసిన ఆ మేలుకొలుపును అందించడానికి ఆ పాత్రలున్నాయి. జగన్నాటకానికి ప్రేక్షకుడిగా, ఆ పాత్రల నుండి ఆ మేలుకొలుపును మనం అందుకోవాలి. మేలు చేయడమెలాగో పుణ్యాత్ముల పాత్రలు చెబుతూ ఉండగా, ఎలా ఉండకూడదో, పాపాత్ముల పాత్రలు చెబుతున్నాయి. ఇక్కడ ఒక సూక్ష్మాన్ని మనం గమనించాలి. ఆ గమనించిన సూక్ష్మాన్ని జీవితం పొడుగునా మనం అమలుపరచుకోవాలి. అదేమిటీ అంటే జగన్నాటకంలోని పాపాత్ముల పాత్రల యెడల మనకు అవగాహన కలగాలి తప్ప, అభిప్రాయమన్నది ఏర్పడకూడదు. వాటి నుండి మనకు కావలసిన దానిని అందుకోవాలి తప్ప, ఆ పాపాత్ముల పాత్రలను ఎట్టి పరిస్థితులలోనూ చిన్నచూపు చూడకూడదు. ఆ పాపాత్ముల పాత్రలను గూర్చి తక్కువ చేసి మాట్లాడకూడదు. తక్కువపాటి అభిప్రాయాలు ఆ పాత్రల యెడల ఏర్పడకూడదు. వారిని అవమానించడానికో, ద్వేషించడానికో, నిందించడానికో మనం ప్రయత్నించకూడదు. అలా ప్రయత్నించినట్లయితే పాపాత్ములయిన ఆ పాత్రల పాప సంస్కారం మన మనస్సులకు అంటుకుంటుంది. మనకు తెలియకుడానే మనం కూడా పాపస్మరణకు, పాపాచరణకు ఒడిగట్టే ప్రమాదం కూడా దీనివలన వస్తుంది. దీనితో ఉన్నస్థాయి నుండి మనం దిగజారడం జరుగుతుంది. పడిపోవడం జరుగుతుంది. పతనం కావడమంటే ఇదే. కనుక పాపాత్ములయిన పాత్రల యెడల మనకు ఉండవలసినది అవగాహన. అవగాహన మాత్రమే ఉన్నపుడు అది మన ఎదుగుదలకు పనికివస్తుంది. అలాంటి పాపాచరణ మన నుండి వ్యక్తం కాకుండా ఒకానొక అతీతమైన స్థితిలో ఆ అవగాహన మనను నిలబెడుతుంది. ***(ఆ లోపాలు మన మనసుకుగాని వస్తే – అవి మనలో ఉన్నాయా లేదా అని చూసుకోవాలి. మనలో లేకుండా జాగ్రత్తపడాలి. – శ్రీబాబూజీ)***

ఒక కోడలు అత్తగారి నుండి పోరును అనుభవిస్తుంది. అనేక విధాల కష్టనష్టాలకు గురి చేయబడుతుంది. ఇక్కడ కోడలు ప్రేక్షకురాలు. అత్తగారు జగన్నాటకంలోని పాత్ర. మనలో ఎవడికివాడు ప్రేక్షకుడు. మిగిలినది జగన్నాటకం అని చెప్పుకున్నాం కదా! అత్తగారిది పాపాచరణకు అంకితమయిన




పాత్ర. అప్పుడు కోడలిలో ఏమి జరగాలి! ఆ అత్తగారి పాత్ర యెడల అవగాహన ఏర్పడాలి! అంతేగాని, మా అత్తగారు దుష్టురాలు అన్న అభిప్రాయం మాత్రం ఏర్పడకూడదు. అత్తగారి పాత్ర యెడల అవగాహన ఏర్పడితే తానొక అత్తగారిగా అయినపుడు కోడలిని బాధించదు. అడుగడుగునా ఆమెకు ఆ పొందిన అవగాహన అక్కరకు వస్తుంది. అత్తగారుగా ఎలా ఉండకూడదో తన అత్తగారి విషయంలో తాను చూసింది కదా! ఒక అత్తగారుగా ఎలా ఉండాలో తాను చూపగలుగుతుంది. అవగాహన అంతగా అక్కరకు వస్తుంది. అంతటి ఎదుగుదలనిస్తుంది. అలాకాక, ఆ అత్తగారి పాత్రయెడల అభిప్రాయ మేర్పడిందనుకోండి 'ఆమె ఒక దుష్టురాలు, రాక్షసి' అనిపించిందనుకోండి. ఇక ఆ అభిప్రాయం కరుడుకడుతోంది. ఆ పాత్ర సంస్కారం కోడలి మనసుకు అంటుకుంటుంది. దానితో ఆ అత్తగారి పాత్రను నిరంతరం నిందించడం, ద్వేషించడం, పదిమందితో చెప్పుకొని పరితృప్తి పొందడం, మాటమాటకూ ఆవిడ ప్రసక్తి తేవడంలాంటి కూడని పనులన్నీ జరుగుతాయి. ఈ కూడని ప్రవర్తనలు కోడలి స్థాయిని దిగజార్చి, ఆమెను కూడా ఒక కుసంస్కారిగా రూపొందించగలవు. అప్పుడేం జరుగుతుంది. ఈ కోడలు అత్తగారయ్యేటప్పటికీ ఆ కోడలిగా వచ్చినామెను రాచిరంపాన పెడుతుంది. తనను తన అత్త ఏడిపించినట్లు, తాను కోడలిని ఏడిపించాలనుకుంటుంది. తన అత్తగారి దగ్గర తానుపడని సుఖం తన దగ్గర కోడలు ఎందుకు పొందాలి అనిపిస్తుంది. తన అవకాశాలన్నింటినీ తన అత్తగారు హరించినట్లుగా, తాను కూడా తన కోడలి అవకాశాలన్నింటినీ హరించడంలో ఒడుపుచూపి ఆనందించాలనిపిస్తుంది. చూసారా! అవగాహన అనే దివ్యస్థితి నుండి, అభిప్రాయమనబడే దిగువస్థితికి పడిపోయేటప్పటికి మానవ ప్రవర్తన ఎంతగా దెబ్బతింటుందో! కనుక మనలో ఎవరికివారు ప్రేక్షకులుగా, మిగిలిన జగన్నాటకాన్ని చూస్తున్నపుడు, ఆ జగన్నాటకాన్ని తగినవిధంగా చూడటం మనకు చేతకావాలి. రసభరితమయిన స్థితిలో, ఆ తాదాత్మ్య స్థితిలో నుండి మనకు కావలసిన ఆ సందేశాన్ని ఆ జగన్నాటకంలో నుండి మనం అందుకుంటూ ఉండాలి. ఆ జగన్నాటకంలోని పుణ్యాత్ముల పాత్రలను మనం అనుసరించాలి. పాపాత్ముల పాత్రలయెడల కావలసిన అవగాహన మనం పొందాలి. అవన్నీ కూడా జగన్నాటక సూత్రధారి నుండి వ్యక్తం చేయబడుచున్నదేనని మనకు తెలియాలి.

మరి ఆ పాపాత్ముల సంగతి ఏమిటి అన్న ప్రశ్న ఒకటి వస్తుంది. కంగారుపడవలసిన పనిలేదు. వారి పరిణామం వారికీ ఉంటుంది. వారూ మనలాంటి వారే! కాలమూ, పరిస్థితులూ వారిలోనూ మార్పులు తీసుకువస్తాయి. ఏదీ ఉన్నట్లుగా ఉండిపోదు, రావలసిన మార్పులకు కావలసిన దోహదం



కృపాహి కేవలం

అందరికీ అందుతూనే ఉంటుంది. పాపవర్తనులు ఎప్పుడూ అలాగే ఉండిపోతారు అనుకోకూడదు. వారిలోనూ ఎవరికివారు ఈ జగన్నాటకానికి ప్రేక్షకులే కదా! వారు నేర్చుకునే పాఠాలు వారూ నేర్చుకుంటూనే ఉంటారు, వారికి అందవలసిన శిక్షణ వారికి అందుతూనే ఉంటుంది. **ఈ సృష్టిలో ఎవరూ వదిలిపెట్టబడరు. ముందు వెనుకలుగా అందరూ తరించేవారే!**

సృష్టిలోని మిగిలిన జీవరాసులకన్నా మానవులకు ప్రత్యేకమయిన స్వేచ్ఛ ఈయబడింది. ఉన్న స్థితి నుండి దిగనూవచ్చు, ఎదగనూవచ్చు. పశుస్థితికన్నా దిగిపోనూవచ్చును. దేవదేవుని స్థితికి ఎదిగిరానూ వచ్చును. అంతటి అవకాశం అతడికి ఈయబడింది.

ఈ స్వేచ్ఛ ఎప్పుడయితే ఈయబడిందో కర్మఫలితం యొక్క అనుభవం కూడా అతడికి ఏర్పాటు చేయబడింది. అతడాచరిస్తున్న ప్రతికర్మకూ ఫలితం అనుభవానికి వచ్చేటట్లుగా ఏర్పాటు చేయబడింది. కర్మఫలితం అనుభవించాలి అంటే, అదేదో ఇబ్బంది అన్నట్లుగా ముఖం పెట్టేవారే ఎక్కువమంది. అది కేవలం తెలియనితనం. దుష్కర్మకు దుష్ఫలితమున్నట్లే, సత్కర్మకు సత్ఫలితం ఉంటుంది కదా! మనం సత్కర్మలే ఆచరించవచ్చు కదా! దుష్కర్మలకు దుష్ఫలితాలు ఎందుకున్నాయి అంటే, మరల మనం అది ఆచరించకుండా ఉండటానికే! అలా అని మనస్సును హెచ్చరించడానికే! నిప్పులో వేలు పెట్టాం. కాలింది గిలగిలలాడాం, వెధవనిప్పు అనుకున్నాం. వెధవ ఎవరు అన్నది మరచిపోయాం, కాలింది, కాలింది అని పదిసార్లు అనుకున్నాం. ఇలా అనుకుంటున్నారుకదా, మనకు చెడ్డపేరెందుకని ఆ నిప్పు బాధపెట్టడం మానేసిందనుకోండి, నిప్పులో వేలు పెట్టాం, బాధ తెలియదు, కాలిపోతూ ఉంటుంది. బాధ తెలిస్తే వేలు ఇవతలికి తీసేవాళ్ళం. ఇప్పుడిక వేలుండదు, చేయుండదు. నిప్పులోనికి వెళ్ళిపోతుంది, మనం అలా వెళ్ళి పోకూడదని, మనవేలు, మన చేయి, మనం చిరకాలం ఉండాలని తనను ముట్టుకోగానే బాధను పెట్టి ఆ ప్రయత్నాన్నుండి విరమింపచేస్తుంది. ఇప్పుడు చెప్పండి. నిప్పు మనకు బాధ కలిగించడం అవసరమా! కాదా! దుష్కర్మలకు దుష్ఫలితాలు ఇలాంటివి, అవి మనను రక్షించడానికే ఉన్నాయని గుర్తుంచుకోవాలి. **– పార్థసారథి ప్రవచనాల నుండి**

**గురువు విధించిన ఓ నిర్దిష్టమైన సాధనా పద్ధతిని అనుసరించేవాడు శిష్యుడు. శిష్యుడంటే శిక్షణ ప్రధానమైన అంశం. అక్కడ ఒక ఉపదేశం, ఒక మార్గం, అనుసరించాల్సిన నియమాలు, విషయాలు ఉంటాయి. – *శ్రీబాబూజీ***


కృపాహి కేవలం

## గురువు - గురి - గురుతు

భక్తితో సోమరి అయిన ఓ భక్తురాలు గురువు పాదాలకు సాష్టాంగ నమస్కారములు చేసి, "గురుదేవా! నన్ను ఈ సంసార బంధాల నుండి (విముక్తి) ఉద్ధరించాలి. అందుకు నాకు మంత్రోపదేశమో, ఉపదేశమో ఇవ్వండి. ఇంతకన్నా నా జీవితానికి ఉత్తమ మార్గం లేదు". అని మనవి చేసుకుంటూ మీ ఉపదేశానికై వేచివున్నాను" అంటుంది.

**సోమరితనం – పనులు చేయకుండా ఖాళీగా ఉండటం అనుకుంటారు. కాని తెలిసిన విషయాన్ని ఆచరించకపోవడం నిజమైన సోమరితనం.**

ఆ గురువుగారు ఇలా అడిగారు "తల్లీ! నీవు సద్గ్రంధాలు చదివావా? రామాయణం, భారతం, భాగవతం, గీత చదివావా? చదివాను స్వామీ! అన్నది. అవి మహర్షి వ్యాస, వాల్మీకుల ఉపదేశాలు (ఉచ్ఛిష్టాలు) అందున్నవి భగవంతుడు స్వయంగా చెప్పిన వచనాదులు. వాటిలో నీకు భగవంతునికి చేరువ చేసేది (ఉపదేశం) ఏదీ కనిపించలేదా? జపించి, తరించదగిన వాక్యం ఒక్కటైనా ఉన్నదనే 'గురి' కుదరలేదా? కుదిరితే వేరే ఉపదేశం అవసరమా? వారి వాక్యాలపై కుదరని 'గురి' సామాన్యుడిని అయిన నేను నీ చెవిలో ఊదే అక్షరాల మీద 'గురి' కుదురుతుందన్న నమ్మకం ఏమిటి? అని అడిగారట.

**– గురుకృప**

## గురువులెందుకు?

"ఆధ్యాత్మిక సాధనకి తప్పక ఒక గురువు అవసరమని చాలామంది చెప్తారు. స్వయంకృషిమీద ఆధ్యాత్మిక సాధన చేసి మోక్షం పొందడానికి వీలు లేదా? అలా పొందినవారు లేరా? గురువు ఉండే తీరాలా? ఉండి తీరాలంటే దాని అవసరం ఎలాంటిది?" అని ఒక జిల్లా కలెక్టర్ మాస్టర్ ఇ.కె.గారిని అడిగారు. దానికి ఆయన ఇలా సమాధానం చెప్పారు.

"ఆధ్యాత్మిక సాధన కేవలం స్వయంకృషి మీదనే ఆధారపడి ఉన్నది. స్వయంకృషి లేనివాడికి ఆధ్యాత్మిక సాధనకి అవకాశం లేదు. ఇక గురువు అవసరం ఎందుకు? అంటే సాధనకి ఉన్న పెద్ద విఘ్నాలను (ఇబ్బందులను) తొలగించడానికి, ఆ విఘ్నం మనమే! మనల్ని మనం తొలగించుకుంటే గాని, ఆధ్యాత్మిక సాధన ప్రారంభం కాదు. ప్రారంభం అయ్యాక గురువు అవసరం ఉండడం, లేకపోవడం ఒక్కటే.




ఇంకొంచెం వివరంగా చెబుతాను. గురువు మనకు అవసరమా? అనే ప్రశ్న మీకెందుకు పుట్టింది? అవసరమైతే మీకు వచ్చిన అభ్యంతరం ఏమిటి? ఆ అభ్యంతరం తొలగడానికే గురువు అవసరం. ఆ అభ్యంతరాన్నే అహంకారం అంటారు. అది తొలగనిదే ఆత్మసాధన లేదు, ఆత్మ అనే సూర్యబింబం కన్నా అహంకారం అనే చిల్లపెంకు ఎంతో చిన్నది. అయినా దానిని కంటికి అద్దం వలే పెట్టుకొని చూస్తే సూర్యబింబం అంతా మాటుపడిపోతుంది. గురువు ఎందుకు? అనే ప్రశ్న తొలగాలంటే గురువును భౌతికంగా ఆశ్రయించక తప్పదు. అతని భౌతిక పాదాలు మన భౌతిక హస్తాలతో పట్టుకోక తప్పదు. గురువెందుకనే ప్రశ్న పుట్టే వ్యాధి మనస్సుకుంటుంది. కనుక దాని నివారణకు గురువును ఆశ్రయించడం తప్పదు. అభ్యంతరం తొలగిన వెనుక గురువు అక్కరలేదు. అక్కరలేదని అనుకున్నవాడికి గురువును ఆశ్రయించనిదే అహంకారం చచ్చినా తొలగదు".

## గురుపూజలలో పెళ్ళిళ్ళు!

"మీరు గురుపూజలలో ఉపనయనములు, పెళ్ళిళ్ళు చేస్తుంటారు. వాటికి వారాలు, వర్జ్యాలు, ముహూర్తాలు, మంచి చెడ్డా ఏమీ అక్కరలేదా" అని ఒకరడిగారు. మాస్టరు ఇ.కె.గారిలా అన్నారు "చెడ్డ అక్కరలేదు, కాని మంచి కావాలి. ఎప్పుడు పెళ్ళి చేస్తే వధూవరులు పదికాలాలపాటు క్షేమంగా సుఖంగా ఉంటారో దానిని ముహూర్తం అంటారు. అది అనేక విధాలుగా ఉంటుంది. గ్రహాలు సూచించే ముహూర్తాలు కొన్ని. తిరుపతిలో పెళ్ళి చేసేందుకు పంచాంగం ముహూర్తం కోసం ఎవడన్నా వెతుకుతాడా? ఏ పిచ్చివాడైనా వెతుకుతాడంటే, ఒక లక్షాధికారి తన ఖజానా సద్వినియోగానికి అప్పచెప్పినప్పుడు అందులో కొన్ని డబ్బులు లెక్క పెట్టుకొని, జేబులో దాచుకునే దరిద్రుడి వంటివాడు. వెనకటికి ఒక రైల్వే అధికారి, ఒక రైలు పెట్టెలో మరమ్మత్తు చేయమని ఒక వడ్రంగిని పిలిచాడు. ఆ వడ్రంగి తన దగ్గర రైలు టిక్కెట్టు లేదని ఆ పెట్టెలోకి రావడం మానేశాడట! అలాంటిదే గురుపూజలలో ముహూర్తాల కోసం పంచాంగాలకి భూతద్దం వేయడం. గురువుల, దేవతల సాన్నిధ్యంలో మహాయజ్ఞాలు అక్కరలేదు. ఇంతకీ ఇన్ని సంవత్సరాల నుండి గురుపూజలలో పెళ్ళిళ్ళు, ఉపనయనాలు చేసుకున్న వారంతా క్షేమంగా, ఆరోగ్యంగా, సుఖంగా ఉన్నారు కదా!"




# ముహూర్తాలు

"నేను మొట్టమొదటగా మీ ఉపన్యాసాలు వినడానికి వచ్చి ఇప్పటికి మూడు మాసాలయింది. నాకు దేవుడిమీద నమ్మకం కలిగింది. రోజూ ప్రేయరు, పూజ చేసుకొనడం ప్రారంభించాలి అనుకుంటున్నాను. ఒక మంచి రోజు చూసి చెప్పండి" అని ఒకరు అడిగినపుడు మాస్టరుగారు ఇలా జవాబు చెప్పారు.

"దేవుడు చెడ్డరోజులను సృష్టించలేదు. అన్నీ మంచిరోజులనే సృష్టించాడు. దేవుని స్మరించక ఇన్నాళ్ళ నుండి నీవే చెడ్డరోజులను సృష్టించుకుంటున్నావు! నీవు ప్రేయరు ప్రారంభించడానికి మంచి రోజు కోసం పంచాంగం చూడనక్కరలేదు. ఏ రోజు ప్రారంభిస్తే అదే మంచిరోజు."

"మా అబ్బాయికి సంబంధం స్థిరమైంది. తిరుపతి కొండమీద వివాహం చేయదలచుకున్నాను. ఒక మంచి ముహూర్తం చూసి పెట్టండి" అని ఒకరు అడిగారు. మాస్టరుగారిలా చెప్పారు "తిరుపతి కొండమీద పెండ్లి చేసేటపుడు మంచి రోజు కోసం చూడకూడదు. నేరుగా బయలుదేరి వెళ్ళి వివాహం చేయటమే కర్తవ్యం." అప్పుడు ఆ వచ్చిన వ్యక్తి "గ్రహాల అనుకూలత కావాలి కదా!" అన్నారు. మాస్టర్ ఇ.కె. మరలా ఇలా అన్నారు "గ్రహాలు బలమైనవో, దేవుని అనుగ్రహం బలమైనదో ముందు తేల్చుకోండి. గ్రహాలను నమ్ముకోవాలో, వేంకటేశ్వరస్వామిని నమ్ముకోవాలో, ఇద్దరిలో ఎవరు బలవంతులో తేల్చుకోండి. స్వామిమీద నమ్మకం ఉంటే గ్రహాలు ఆయన దాసానదాసులు. గ్రహాల మీద ఎక్కువ నమ్మకం ఉంటే తిరుపతి మానేయండి. మీరు గుణించుకొని వెళ్ళిన ముహూర్తము తిరుపతిలో పనిచేయదు. స్వామి నిర్ణయించిన ముహూర్తానికి పెళ్ళి చేయడం శుభమైన మార్గం."

ఆ మాటలు ఆయనకు రుచించలేదు. ఇంకొకరిచేత ముహూర్తం పెట్టించి తిరుపతికి బయలుదేరారు. వధూవరులు రైలులో, మిగిలిన పెండ్లివారంతా కార్లలో బయలుదేరారు. ఒంగోలు, నెల్లూరుకు మధ్య ఒక కారుకి ఏక్సిల్ విరిగిపోయింది. వారి ప్రయాణం ఆ పూటకి ఆగిపోయింది. వధూవరులు సకాలంలో స్వామి సన్నిధికి చేరి వేచియున్నారు. మిగిలిన పెండ్లి పెద్దలు–మానవుడు పెట్టిన ముహూర్తం దాటిన మూడు గంటలకు చేరుకున్నారు. వెంటనే అక్కడ కొందరి పెండ్లిండ్లు జరుగుతున్నాయి. పురోహితుల వారు ఈ దంపతులను కూడ కూర్చోబెట్టి పెండ్లి చేసేసారు. ఆ దంపతులు చల్లగా వర్ధిల్లుతున్నారు.

ఒక విద్యార్థి కొన్ని రోజులలో పరీక్షకు వెళ్లబోతూ "హాల్ టికెట్ తెచ్చుకోవాలి, మంచి సమయం చూసి చెప్పండి, దీనితో పరీక్ష గన్‌షాట్‌గా పాసయి తీరాలి" అన్నాడు.




"నువ్వు పరీక్షలకు బాగా చదువుతున్నావా?" అని ప్రశ్నించారు మాస్టరుగారు. "చాలా శ్రమపడి చదువుతున్నాను" అన్నాడు విద్యార్థి. అపుడు మాస్టరుగారు ఇలా చెప్పారు "హాల్‌టికెట్‌కి మంచి ముహూర్తం చూస్తే, గన్‌షాట్‌గా పాసయ్యే సదుపాయం ఉండగా శ్రమపడి చదవడం ఎందుకు? అందుకు విద్యార్థులు కాళ్ళు చాచుకొని పడుకొని మంచి ముహూర్తంలో హాల్ టికెట్ తెచ్చుకొని ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులు కావచ్చును గదా! పరీక్ష పాసవడం హాల్‌టికెట్ తెచ్చుకునే ముహూర్తం మీద ఆధారపడి ఉండదు. ఒకవేళ పరీక్షలు అమావాస్యనాడో, వర్జ్యం సమయంలోనే ప్రారంభం అయినాయి అనుకో, పరీక్షకు వెళ్ళడం మానేస్తావా? అప్పుడు పరీక్ష వ్రాసినవాళ్ళు యావన్మంది తప్పుతారంటావా? కనుక వాళ్ళు ఏ సమయంలో హాల్‌టికెట్ ఇస్తున్నారో అదే మంచి సమయం". **– పై మూడు శీర్షికలు సత్యదేవ్‌గారి 'చెణుకులు' నుండి**

## ధర్మము - ధర్మాచరణము

నాకు గుర్తున్నంతవరకు అది 1965వ సంవత్సరం. పరమాచార్య స్వామివారు తిరుపతిలో మకాం చేస్తున్నారు. స్వామివారు వేంకటేశ్వరస్వామివారికి కళ్యాణోత్సవం చేయించారు (600రూ. టికెట్టు) కళ్యాణోత్సవం తరువాత దేవస్థానం వారు ప్రసాదాలను ఇచ్చారు. కళ్యాణోత్సవం చేయించిన వారికి స్వామివారి దర్శనం కల్పిస్తారు. వీరిని మామూలు క్యూలైన్లలో కాకుండా వేరేగా స్వామి దర్శనానికి పంపిస్తారు. ఆలయ పేష్కారు స్వామివారిపై ఉన్న అపరిమిత భక్తి వల్ల పరమాచార్య స్వామివారితో ఉన్న మా అందరినీ శ్రీనివాసుని దర్శనానికి రమ్మని పిలిచారు. మేము దాదాపు ఒక పదిహేను మందిదాకా ఉన్నాము.

అప్పుడు పేష్కారుతో మహాస్వామివారు "కళ్యాణోత్సవం చేయిస్తే ఎంతమందిని దర్శనానికి అనుమతిస్తారు" అడిగారు. "ఆరుమందిని" అని పేష్కారు బదులిచ్చాడు. "అలా అయితే మేము ఆరుమందిమి మాత్రమే ఈ విశేష దర్శనానికి వస్తాము. నేను, పుదుపెరియావ (జయేంద్రసరస్వతి స్వామి), మరో నలుగురు" అని చెప్పారు. వెంటనే చెప్పారు "అందరమూ వెళ్ళవచ్చు. ఏమీ పరవాలేదు" అని అన్నాడు. "అది తప్పు. అధర్మం. దేవస్థానం ఒక నియమం చేసింది. కళ్యాణోత్సవం




టిక్కెట్టుపై ఆరుమందికి విశేష దర్శనం అని. నీవు దేవస్థానం ఉద్యోగివి, నీకు నాపైన ఉన్న భక్తి వల్ల పదిహేనుమందిని దర్శనానికి పంపించడం సరికాదు. దీనివల్ల రెండు తప్పులు జరుగుతాయి. దేవస్థానం తీసుకున్న నిర్ణయాలను ఒక దేవస్థానం ఉద్యోగియే ధిక్కరించడం. అంత నిబంధనలను పెట్టినవారే వాటిని పాటించకపోతే ఇక ఇటువంటి నిబంధనలు ఎందుకు? మరొకటి నియమాలను అతిక్రమించడానికి నేనే ఒక అవకాశం ఇచ్చినట్టు. కాబట్టి మేము ఆరుగురు మాత్రమే వస్తాము” అని చెప్పారు.

పేష్కారు ఏదో చెప్పబోతుండగా, మహాస్వామివారు మధ్యలోనే “ధర్మం కేవలం ప్రచారం చేయడానికి మాత్రమే కాదు, స్వయంగా దాన్ని తప్పక అనుష్ఠానించి చూపాలి.” “రామో విగ్రహవాన్ ధర్మః – మూర్తీభవించిన ధర్మమే రాముడు” అన్నట్లు ఈ సంఘటనను నా కళ్ళారా చూడటం చేత పరమాచార్య స్వామివారు సాక్షాత్ రెండవ రాముడై “ఈ యుగానికి రాముడు” అని, అర్థమైంది.

గురువుగారు శిరిడీకి నివాసం మార్చిన తొలిరోజుల్లో ప్రతిదినం మందిరానికి వెళ్ళేవారు. ఆ రోజుల్లో ద్వారకామాయిలో అంత రద్దీ ఉండేది కాదు. గురువుగారు బాబాకు నమస్కరించుకొని తదుపరి నింబార్ ప్రక్కన కొలంబా ఎదురుగా కొంతసేపు ధ్యానంలో కూర్చునేవారు. తరువాత బాబాకు నమస్కరించి, సమాధి మందిరానికి వచ్చేవారు. అక్కడ క్యూలో నిలబడి బాబా దర్శనం చేసుకునేవారు. పాసు ఉపయోగించి దర్శనం చేసుకోవడంగాని, మందిర నిర్వాహకులే పిలిచినా, విఐపి దర్శనం చేసుకోవడం గాని గురువుగారు ఎన్నడూ చేయలేదు.

“వారు అంతగా పిలుస్తుంటే వెళితే ఏం సార్” అని ఒకసారి నేను అడిగితే, దానికి గురువుగారు, “మనమేమన్నా బాబా దగ్గర విఐపిలమా అలా దర్శనం చేసుకోవడానికి? మనం బాబా సేవకులం. అలా క్యూలో నిలబడి బాబా ధ్యాసలో ఉండి బాబాను దర్శించుకుంటే ఆ ఫలితం వేరు. బాబా ముందు విఐపిగా నిలబడి, ఆ గుర్తింపుతో బాబా వద్ద ఉంటే వచ్చేది వేరు'' అన్నారు. ఎవరైనా పాసుమీదగాని, విఐపిగా గాని దర్శనానికెళితే గురువుగారు ఇష్టపడేవారు కాదు.

*– సాయి దీవెన, ‘బాబాపథంలో’ పే. **373***

**చదివినది, విన్నది ధర్మం కాదు. ఆచరించినదే ధర్మం.**

# గురుకృపాలహరి




శ్రీనిలయమైన కమలం అడుసు నుండి ఉద్భవిస్తున్నప్పటికీ దానిచే కించిత్తు మాలిన్యము పొందక, తన శిరస్సును జలాల పైకెత్తి వినిర్మల వాతావరణంలో తేలియాడుతూ, తన దివ్య సౌరభ సౌందర్యాలను నలుదిక్కులా నెలార్చుతూ ఉంటుంది. రాయంచ (హంస) జల సమ్మిళితమైన పాలనుండి జలాన్ని వేరుపరచి పాలను గ్రోలుతుంది. ఇట్లే మహనీయులు సంసారంలో మెలగుతూ ఉన్నప్పటికీ, సంసార పంక నిమగ్నులు కాక నిర్లిప్తులై బ్రహ్మానందామృతాన్ని గ్రోలుతూ పరమహంసలై, విరాజిల్లుతుంటారు. మానస సరోవరంలా ప్రశాంతం, గంభీరం, మందాకినీ తోయల్లా వినిర్మలం, సుమధురం, నవవికసిత ప్రసూనంలా మృదులం, మనోజ్ఞం, హిమాలయం పోల్కి సుస్థిరం, మహోన్నతం అయివుండీ దివ్య ఫలసంభరిత తరుశాఖ చందాన వినమ్రం, విశ్వజన మహోపకారం అయిన శీలంతో దీపించే వీరే సర్వజన సన్మార్గ దర్శకులు, విశ్వకళ్యాణ హేతుభూతులు.

**– స్వామి చిరంతనానంద**

సద్గురు చరణాలు శ్రేయోదాయకాలు. సద్గురు స్మరణ కల్మష చిత్తంలో కలువలను పూయిస్తుంది. సద్గురుని తలపు నావంటి అధములను కూడా మనిషిగా నిలుపుతుంది. వారి రూపం వెలుగు చీకట్ల వంక లేక అనుక్షణము క్రీనీడలా ఉండి అతులిత మనోధైర్యాన్నిస్తుంది. సద్గురుని నామం తలచిన క్షణమే దేహంలోని కణకణము నూత్నజీవమును సంతరించుకుంటుంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే **'కృపాహి కేవలం'. గురుదేవా! పాహి!పాహి! అవధులు లేని మహాత్ముల మహత్తును వర్ణించ ప్రయత్నం చేయడానికి అర్హతానర్హత తెలియక పూనుకున్నాను. నిర్హేతుక కృపాసముద్రమైన మీ ఆశీస్సులనే జలాలు – స్వధర్మానుష్ఠానాల, త్యాగమయ, తేజోమయ మహాత్ముల జీవిత విశేషాల అక్షరసుమాలు. మీ ఆశీస్సులు, తపోమయులైన గురుచంద్రుల లీలా దర్శనాలు– తొలగాలి మాలోని మనో మాలిన్యాలు. దేదీప్యమానమైన శరశ్చంద్రుని వెలుగులు – దీపస్థంభాల వంటి మహితాత్ముల చరితలు – భక్తిమాత్రోపజీవులకు మార్గదర్శకాలు, స్ఫూర్తిదాయకాలు.**

'గురుకృప'కు ఆధారము శరశ్చంద్రులు. ఏల ఇయ్యది శ్రీచంద్రశేఖరుల జీవితము – ఈ అధ్యయనము అన్న మీమాంస కలిగినది. పలుతావుల పరుగుపెట్టే 'మనో' రథమున సద్గురుని నిలుపవలెనన్న 'ధర్మ' స్వరూపుల చరితలు ఆలంబన కాగలవు. 'ధర్మము' అన్న మాటకు అమరకోశము చెప్పిన అర్ధము 'ఆచరించునది' అని. ఇద్దరు సంయమీంద్రులు ఆచరణకు ఆలవాలములే! ఆచరణమే వారి ఆభరణము. ఇరువురును అంతర్యామిత్వముతో శోభిల్లి ఆశ్రయించిన జీవుల ఆత్మోద్ధరణకై అనుక్షణము తపించిన అనుగ్రహమూర్తులు. భూమ్యాకాశముల కలుపు మూలస్థంభము సద్గురువు. అట్టి సద్గురువును చేరుటకు ఎన్నియో మార్గములు, ఎన్ని జన్మల పర్యంతమో వారి చరణాశ్రయమును చేసినను వారి విరాట్ స్వరూపము గాంచుట సాధ్యము కాదు. **మహాత్ముల మధురతర లీలా వినోదాల నడుమ మద్గురుదేవుల ఉనికి – మదిన**



కృపాహి కేవలం

**సుప్రష్టితం కాకపోతుందా అన్న ఒక సద్విచారమే ఈ 'శరత్‌చంద్ర'శేఖరోదయం. ఆ 'ఆదర్శ'మూర్తుల సద్దర్శనమే – మనలోని 'అహం' పొరలను వారి అనుగ్రహ 'అగ్ని' కీలలలో సమిధలుగా సమర్పించగలదు.**

కంచి పీఠపరంపరలో 68వ ఆచార్యునిగా 13 సం॥ల బాలుడు స్వామినాథన్ – చంద్రశేఖర సరస్వతీ స్వామిగా ప్రతిష్ఠితమయిన అంశాన్ని అవలోకించుకుంటూ – 62వ ఆచార్య స్వాముల కాలంలో తొండై మండలం రాజ్యంలో ఉన్న రాజకీయ అనిశ్చితి కారణంగా పీఠం యొక్క ముఖ్య కేంద్రాన్ని కంచి నుండి కుంభకోణమునకు మార్చబడినది. పీఠము యొక్క నిర్వహణ అత్యంత శ్రద్ధా భక్తులతోను, ఎంతో జాగరూకతతోను కూడుకున్నది. కనుక సకల శాస్త్ర, విద్యాపారంగతునిగానే కాక ఆచార్యస్వాములు వ్యక్తులు, వ్యవహారములతో కూడా విశేషజ్ఞులు కావలసియున్నది. 13 సం॥ల బాలుడైన ఆచార్యులు కలవాయి నుండి కుంభకోణంనకు పయనమయ్యారు. పీఠారోహణ అనంతరం కుంభకోణం వెళ్ళే దారిలో పూర్వాశ్రమంలో వారి స్వగ్రామమైన తిండివనంలో మూడు రోజులు విడిది చేసారు స్వామి.

1907 సం॥లో జరిగిన ఈ సంఘటన ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. వారి తల్లిదండ్రుల నివాస స్థానమైన తిండివనం వారం రోజుల ముందునుండే పండుగ వాతావరణంలో శోభిల్లింది. బాలాత్రిపుర సుందరీసమేత చంద్రమౌళీశ్వర అభిషేకాన్ని చూడడానికి మరియు నిన్నటిదాకా వారి మధ్యనే బాలుడిగా నడిచి, ఈ రోజు జగత్తును ధర్మమార్గంవైపు నడిపే జగద్గురువుగా విలసిల్లే 'స్వామి'ని దర్శించుకోవడానికి ఆ ప్రాంత ప్రజలకు రెండు కళ్ళు చాలలేదు. ప్రత్యేకించి ఆర్కాట్ మిషన్ హైస్కూల్ ఉపాధ్యాయులు, సహవిద్యార్థులు, విద్యార్థులు అందరూ జగద్గురు 'స్వామి'ని దర్శించి, పరమానందభరితులయ్యారు. ఎప్పుడెప్పుడు 'స్వామి'ని కలుద్దామా అన్న ఉత్సుకత వారిలోని 'ప్రేమ'ను వ్యక్తం చేసింది. ఆచార్యులు వారిని విడివిడిగాను, సమూహాలుగాను కలిసి ఆశీస్సులు – బహుమతులు ఇచ్చి ఆనంద సాగరంలో నింపారు. శంకరస్థాపితమైన పీఠమునకు తమ ఊరి బాలుడు అధిపతిగా విలసిల్లి జగద్గురువుగా దిశానిర్దేశం చేసే ఈ బృహత్ కార్యాన్ని వయోబేధము లేక తిండివన జనసామాన్యమంతా ఒక్కటై, 'స్వామి' చరణాలకు ప్రణమిల్లి, నీరాజనాలు అర్పించి సాగనంపింది. **ఆంగ్లవిద్య, మిషనరీ స్కూలు నేపథ్యమున్న నిన్నటి చిన్నారిని – జగద్గురువుగా స్వీకరించి వారి ఆశీఃదృక్కులకై వేచి – వారి ప్రేమధారలలో తడిచి ఆనందించిన ఆ విశాల హృదయాలు మనలోనూ పరిణితిని తీసుకురావాలి. 'నేను' అన్న భావనలో వేళ్ళూనుకుపోయి 'విశ్వాసాలు' సన్నగిల్లి 'విశ్లేషణ'లకు నిలయమయి 'విత్త'మే జీవితమవుతున్న మనలో పరివర్తన రావాలి.**

సన్యాసాశ్రమ స్వీకరణ చేసినప్పటికిని పీఠారోహణ కార్యక్రమమున ఆచార్య స్వాములకు 'చక్రవర్తి'కి వలసిన విశేష గౌరవ మర్యాదలను అందించుట, సత్కరించుట భరతవర్షమున సాంప్రదాయకంగా ఉన్నది కదా! తదనుగుణంగా స్వామి పీఠారోహణమును పురస్కరించుకొని 1907వ సం॥ మే 9వ తేదీన




కుంభకోణంలో ఒక మహోత్సవ పర్వదినం వేడుకగా జరిగింది. దేశ విదేశాల నుండి ఎందరో అతిధులు వేంచేసారు. తంజావూరు చివరి మహారాజైన శివాజీ మహరాజుగారి ఇద్దరు రాణులు తమ గౌరవ మర్యాదలతో స్వామిని సేవించుకున్నారు. భరతవర్షంలో విలసిల్లే జీవనదీమతల్లుల జలాలతో స్వామివారిని అభిషేకించారు బుధజనులు.

విరబూయబోతున్న సౌగంధానికి సూచిక అన్నట్లు మృదుమధుర మల్లెలతో స్వామివారికి పుష్పాభిషేకం జరిగింది. కుంభకోణమంతా పండుగ వాతావరణంతో శోభించింది. అంబారీల ఏనుగులు, యోధుల గుర్రాలు, లొట్టిపిట్టల వాయిద్యస్వరాలు, బంగారు, వెండిరథాలు, వినూత్న వాయిద్యాలు, భక్తిగీతాలాపనలు, సాంప్రదాయక నృత్యాలు ఇలా ఎన్నో! వీటన్నిటి మధ్య పీఠారోహణ చేసిన ఆచార్యుల చిత్రపటం కంచిమఠ ఏనుగు అంబారీపై సింహాసనాలంకృతము చేయగా జరిగిన ఊరేగింపు నేల నాలుగు చెరగులా వేంచేసిన భక్త జన హృదయాలలో సమ్మోహనంగా ముద్రించుకుపోయింది. **ఏమి భరతవర్ష భాగ్యము. మహాత్ముల జననము. పునీతమయ్యెను తలనిడి గురుచంద్రుల చరణము!** పరంపరగా వస్తున్న ఆచారవ్యవహారాల కోణంలో 'స్వామి' పీఠారోహణ కార్యక్రమం పూర్తి అయినది.

జనబాహుళ్యంలో భగవత్ విశ్వాసాలను పాదుకొల్పే క్రమంలో ఆచార్యుల పూజాదికాలు, సత్సంగాలు, పర్యటనలు, ఇలా విజయయాత్రలుగా సాగేవి. వీటన్నింటి వెనుక మనిషిలోని దైవత్వాన్ని మేల్కొల్పడమే ధ్యేయమన్నది మనం గుర్తెరగాలి. పరమాచార్యుల ప్రథమ విజయయాత్ర ఫిబ్రవరి 1908వ సం॥లో జంబుకేశ్వరంలోని అఖిలాండేశ్వరి అమ్మవారి తాటంక ప్రతిష్ఠతో ప్రారంభమయింది. తాటంక ప్రతిష్ఠ మరియు కుంబాభిషేక కార్యక్రమమును ఆచార్య స్వాములు కనులపండుగగా నిర్వహించారు. ఆ తర్వాత ఇలయత్తాంగుడిలో వేంచేసిన 65వ పీఠాధిపతుల అధిష్ఠానము (సమాధిస్థానము)ను దర్శించి వారిని సభక్తికంగా సేవించుకున్నారు. 1909వ సం॥లో పన్నెండు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే మహామాఘమును కుంభకోణంలో విశేషంగా జరిపారు. ప్రభుత్వ, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో భక్తులందరికీ ఏర్పాట్లు జరిగాయి. ఆ రోజుల్లో ఆచార్యులు సాంప్రదాయక స్నానమాచరించి ఏనుగు అంబారీపై మఠమునకు తిరిగివచ్చే మధుర క్షణాలను దేశవిదేశాలలో విశేషంగా చెప్పుకునేవారు. పదునైదు సంవత్సరాల వరకు స్వామి తమ సంస్కృత విద్యాభ్యాసాన్ని కుంభకోణంలోని మఠంలోనే సాగించారు. జిజ్ఞాసార్తుల రాకతో ఎప్పుడూ సందడిగా ఉండే మఠ ప్రాంగణంలో కొంత స్థలాభావం కూడా ఉండడంతో పవిత్ర ఉత్తర కావేరీ తీరంలోని మహేంద్రమంగళం స్వామివారు పరిపూర్ణ జ్ఞాన భక్తి స్వరూపునిగా వ్యక్తమయ్యే క్రమంలో గొప్ప వేదికయ్యింది. అఖండ కావేరీ తీరంలో ఒక పర్ణశాలలో పరమాచార్యుల విద్యాభ్యాసం సాగింది. సన్యాసాశ్రమ పర్యంతము వారు ఎన్నడునూ నాలుగు గోడల మధ్య నివసించలేదన్నది సత్యము. ఆర్తరక్షణకై వారు విలసిల్లిరి– కనుక వారున్న ప్రాంగణమున ద్వారబంధము కానరాదు. బిడ్డలు తల్లిని చేరే క్రమంలో అడ్డుగోడ లెక్కడివి! ఇది బ్రాహ్మణ మసీదు! ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన నడిపిస్తాడన్న




సాయి సామ్రాట్టు మాతృప్రేమ మదిలో మెదులుతోంది.

ఇక స్వామివారి మహేంద్రమంగళంలో కొనసాగిన విద్యాభ్యాసానికి వద్దాం. విద్యను సముపార్జించే వయసు–'జగద్గురు'వన్న యశస్సు – సామ్యము కానరావడం లేదు కదూ! నిజమే! వివేకానందుల మాటలే ఇందుకు సమాధానం. "మానవజాతి చరిత్రలో దైవాంశ సంభూతులు రావడం మనం చూస్తున్నాం. పుట్టుకతోనే, వారు వచ్చిన కార్యమేదో స్పష్టమై ఉంటుంది. వారి కార్యప్రణాళిక సమగ్రంగా నిర్ణీతమై ఉంటుంది. వారు తమ కర్తవ్యం నుండి అంగుళమైనా చలింపరు. వారొక కార్యనిమిత్తం అవతరిస్తారు. ఒక సందేశంతో వస్తారు". మానవునిలోని పశుసంస్కారాలను సంహరించడానికి దైవమే మనిషిగా అవతరించబోతుంటే ఆ 'అంతర్యామి'కే అందని జ్ఞానమేముంటుంది? ఒక సంస్కృత శ్లోకంలో అన్నట్లు "చెట్టుకింద కూర్చున్న ఆచార్యుణ్ణి నేను చూసాను. ఆయన పదహారేళ్ల ప్రాయంవాడు. అతని శిష్యుడు ఎనభైఏళ్ళ వృద్ధుడు. గురువు మౌనోపదేశం చేసాడు. అంతటితో శిష్యుని సందేహాలన్నీ నివృత్తమైనాయి". ఈ మాటలు అక్షరమక్షరం కంచి యతీంద్రుల విషయంలో సరిపోతుంది. మహామహోపాధ్యాయులు, తాత్త్వికులు, శాస్త్రపారంగతులు, పండితులు, తార్కికులు, మీమాంసలో విశేషజ్ఞులు ఇలా కొందరు సు'మేధ'జ్ఞులు స్వామి వారికి బోధించే భాగ్యాన్ని పొందారు. ఎవరు ఎవరికి 'బోధ' చేశారన్న దానికి 'కాలమే' సమాధానం చెప్పింది. గురువు 'జ్ఞాన' భాస్కరుడు. వారి తేజస్సు సదా సమున్నతమే! తూర్పున సూర్యోదయము చూడగనే ఆహా తొలివెచ్చని కిరణమని సంతసించినా, నడిమిన తాళలేకున్నామని ఆలసించినా అది భూమియొక్క ఆవృతమే కదా! జ్ఞాన గురుభాస్కరుని స్థితి ఎప్పుడూ ఒక్కటే. అదియే మా గురుదేవుల జీవితమున ప్రకాశించినది. వారిని సమీపించిన పండితులు, తార్కికులు, నవీన విద్యాధికులు, చారిత్రకులు, సాంప్రదాయకులు... ఇలా ఒక్కరేమి – పెక్కు పరిశోధకుల మాట ఒక్కటే. "సమకాలీన ఆధ్యాత్మిక చరిత్రలో శ్రీబాబూజీ వంటి మేధో సంపన్నులు బహు అరుదు. ఎన్నో జీవిత కాలాలలో కానీ సాధ్యపడని జ్ఞాన సంపద వారి సొత్తు!". 'గిరి' ప్రదక్షిణ చేయాలంటే ఒక రోజు సరిపోతుంది. మరి జగత్తంతా నిండిన 'గురు'ప్రదక్షిణ చేయాలంటే ఎన్ని జన్మలు కావాలి. మస్తిష్కంలో మెదిలిన ప్రశ్న ఇది. ఇంతటి జ్ఞానం ఎలా సాధ్యం అని ఆర్తిగా ప్రశ్నిస్తే వారేమో 'కృపాహి కేవలం' అంటారు. మనందరినీ కాపాడి – రక్షించేది – తరింపచేసేది కేవలం 'గురుకృప' మాత్రమే. (ఇంకా ఉంది)

**– గురుకృప**



కృపాహి కేవలం

గురువు పని చేయని క్షణము లేదు. వారు అలసిన క్షణము కూడా లేదు. నిరంతర క్రియాశీలి. కాని చేసినట్లు కనపడరు. బాధ్యతాయుతమూర్తి. కాని బరువును మోస్తున్నట్లు అనిపించదు. లీలాప్రాయమైన నిర్వహణమతనిది. చిరునవ్వు చెరగని జీవన విధానమతనిది. మనందరి పెదవులపై చిరునవ్వు చెరగరాదన్న దీవెన వారిది. మానవజీవితాన్ని ఒక లీలా విశేషంగా నిర్వహించడమెలా అని నిరూపించడానికి, బోధించడానికి, నడిచి చూపి, మనలను నడిపించడానికి దిగివచ్చిన దేవదేవుడతడు. తెలిసి, తెలిపి నడపడానికి వచ్చిన సారధి వారు. వారి అడుగుజాడలు ఈ సృష్టికి శాశ్వత తరుణోపాయాలు, సకల ఆనందప్రదాలు, అవి కలిసంతరణ మార్గాలు, పరమానందప్రదాలు. అట్టి సద్గురువే లభించాక మనిషి నాకింకా కావాలి అనే స్థితి నుండి నాకింకేం కావాలి అన్న స్థితికి ఎదగడమే నిశ్చింత, నిశ్చలత.



ధవళ కాంతులీనే దర్శనం!
ఏవేళ కల్గినా మది తన్మయం!!
మౌనవ్యాఖ్యలే ప్రేరణం!
తత్త్వ శోధనకు అది సాధనం!!
కరుణ పొంగే మానసం!
అపురూపం ఈ పరిచయం!!
అభయమిచ్చే ఆదరం!
ఆశ్రితులకు సర్వదా సంరక్షణం!!
ప్రేమ చిందే లోచనాలు!
'నీ' నిలువెల్లా నిండును ఆ ఆలోచనలు!!
శ్రీసాయిని చూపిన విధం
సాయిచరిత్రలో ఓ శరదృతు సదృశ్యం!!
మనోహరమైన రూపం।
నమస్కరించును 'నీ' లోని ప్రతి కణం కణం॥

కృపాహి కేవలం